# సూర్య
నేటి దినపత్రిక
www.suryaa.com

## ఆదివారం
24.12.2023




# జీవితం ధన్యం
# ఉత్తర ద్వార దర్శనం

## ఛైర్మన్‌తో ముఖాముఖి



**నూకారపు సూర్యప్రకాశరావు**
**ఛైర్మన్, నేటి దిన పత్రిక సూర్య**

**తెలంగాణ లో వాహనదారులకు పోలీసులు గుడ్ న్యూస్ చెప్పబోతున్నారని వార్తలు వస్తున్నాయి. . ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ చలానాలు క్లియర్ చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వబోతున్నారన్న వాదనలు నిజమేనా? మీరేమంటారు సర్..**

**ఎం. చిత్తరంజన్, హైదరాబాద్**

అవును మీరు విన్నది నిజమే చిత్తరంజన్ గారూ గతంలో మాదిరిగానే రాయితీ కల్పించబోతున్నారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమించే వాహనదారులకు ఫైన్స్ వేస్తుంటారు పోలీసులు. హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో చూసి ఫైన్లు వేస్తుంటే కొన్ని ప్రాంతాల్లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఫొటోలు తీసి ఫైన్ వేస్తుంటారు. ఇలా రకరరకాల మార్గాల్లో తెలంగాణ వ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించే వాళ్లపై చలానాలు వేస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. అంతే కాకుండా ఫైన్స్ కూడా వాళ్లు చెల్లించడం లేదు. దీంతో ఈ బకాయిలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయి. పోలీసులకు చిక్కిన వాళ్లు మాత్రమే స్పాట్‌లో చెల్లించి బయట పడుతున్నారు. ఒక్కొక్క వాహనంపై వేల రూపాయలు ఫైన్స్ పెండింగ్‌లో ఉంటున్నాయి. అలాంటి పెండింగ్ చలానాలు క్లియర్ చేసుకునేందుకు పోలీసులు శాఖ ఆఫర్లు ప్రకటిస్తోంది. గతేడాది ఇలాంటి ఆఫర్ ప్రకటించడంతో భారీగా ఫైన్స్ వసూలు అయ్యాయి. ఇప్పుడు కూడా మరోసారి ఆఫర్ ఇవ్వాలని పోలీసులు శాఖ భావిస్తుందని వార్తలు వినిపిస్తున్నాయి. గతేడాది టూ వీలర్ వాహనదారులు తమ వెహికల్‌పై ఉన్న చలానాలో 75 శాతం చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఫోర్, హెవీ వెహికల్ పై ఉన్న ఫైన్‌లో 50 శాతం చెల్లిస్తే చాలని పేర్కొన్నారు. ఈ ఆఫర్ ఇవ్వడంతో చాలామంది ముందుకు వచ్చి తమకు ఉన్న పెండింగ్ చలానాలు క్లియర్ చేసుకున్నారు. గతేడాది తెలంగాణ పోలీసులు తీసుకున్న ఈ నిర్ణయం కారణంగా 45 రోజుల్లోనే 300 కోట్ల రూపాయలు వసూలు అయింది. అప్పటి వరకు పెండింగ్ ఉన్న వాటితో చూసుకుంటే 60 శాతం వసూలు అయింది. అప్పటి నుంచి మళ్లీ పెండింగ్ భారం పెరిగిపోయింది. వసూలు కావాల్సిన చలనాలు పేరుకుపోతున్నాయి. వాటిని తగ్గించుకునేందుకు పోలీసు శాఖ మరోసారి క్లియరెన్స్ ఆఫర్ ఇవ్వబోతోందని టాక్ నడుస్తోంది. దీనికి సంబంధించిన విధి విధనాలు వచ్చే వారం వెలువడే ఛాన్స్ ఉందని అంటున్నారు. చూద్దాం ఏం జరగబోతోందో?

**ప్రముఖులు, వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకుల ఇళ్లలో ఇన్‌కమ్ ట్యాక్స్ రైడ్ జరిగినప్పుడు పెద్ద మొత్తంలో డబ్బుల కట్టలు బయటపడినట్లు వార్తలు చూసే ఉంటారు. ఇటీవలో ఓ నాయకుడి ఇంటిలోని బీరువాల నిండా నోట్ల కట్టలు బయటపడిన విషయం తెలిసిందే. ఇలా లెక్కకు మించి డబ్బులు దొరికినప్పుడు ఐటీ శాఖ వాటిని సీజ్ చేస్తుంటుంది. అందుకే ఆ డబ్బులు ఎక్కడి నుంచి వచ్చాయి అనేదానికి సరైన లెక్కలు ఉండాలి. అసలు ఇంట్లో ఎంత డబ్బు దాచుకోవచ్చు? ఎంతైనా దాచుకోవచ్చా లేకా దానికి ఏదైనా లిమిట్ ఉందా? ఎక్కువ దాచుకుంటే ఏమవుతుంది? వివరాలు చెప్పండి**

**– శ్రీనివాస మార్తాండ, విజయవాడ**

మీరన్నది నిజమే శ్రీనివాస్‌గారూ ఇంట్లో ఎంత మొత్తమైన నగదు నిల్వ చేసుకోవచ్చు అన్నది కొంతమందిలో సంశయం ఉన్న మాట వాస్తవమే. అయితే ఇంత వరకే ఉండాలి అనే కచ్చితమైన రూల్స్ ఏమీ లేవు. ఆదాయపు పన్ను శాఖ సైతం ఇంతే డబ్బు ఇంట్లో ఉంచుకోవచ్చు అని చెప్పలేదు. అయితే.. ఇంట్లో దాచుకున్న డబ్బులకు సరైన లెక్కలుండాలి. మీ ఇంట్లో ఎంత డబ్బు ఉంది? అది ఎక్కడి నుంచి మీకు వచ్చింది? అనే పూర్తి విషయాలను ఆధారాలతో సహా మీరు ఆదాయపు పన్ను శాఖకు చెప్పగలగాలి. అందుకు సంబంధించిన డాక్యుమెంట్లు కూడా ఉంటే ఇంకా మంచిది. అప్పుడు మీకు ఎలాంటి చిక్కులు రావు. బిజినెస్ విషయానికి వస్తే దానికి సంబంధించిన అన్ని రకాల ప్రూఫ్స్ ఉండాలి. ప్రతి పైసాకు లెక్కలు చూపించాల్సి ఉంటుంది. ఇదే సమయంలో మీరు ట్యాక్స్ కడుతున్నారా లేదా అనేది చూస్తారు. పన్ను చెల్లించకుంటే ట్యాక్స్ ఎగవేత కింద చట్ట పరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. మీ డబ్బులకు సరైన లెక్క లేని సందర్భంలో ఆ నగదు మొత్తాన్ని సీజ్ చేసే అధికారం ఐటీ శాఖకు ఉంటుంది. మీరు వ్యవసాయం ద్వారా సంపాదించినా వాటికి సంబంధించిన బిల్లు కూడా ఉండాలి. ఇలా అన్ని విధాల జాగ్రత్తగా ఉన్నప్పుడే మీరు ఇంట్లో దాచుకున్న డబ్బులను కోల్పోకుండా ఉండొచ్చు. లేదంటే ఐటీ శాఖ మొత్తం తీసుకెళ్తుంది. మీ దగ్గర మొత్తం ఎంత డబ్బు ఉంది? మీకు వచ్చే ఆదాయం ఎంత? ఆ ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నా అన్న ప్రశ్నలు మీకు ఐటీ శాఖ నుంచి ఎదురవుతాయి. మరోవైపు.. ఇంట్లో ఉన్న నగదు పన్ను పరిధిలోకి వస్తే దానికి సైతం టాక్స్ చెల్లించాల్సిందే. లెక్కకు మించిన డబ్బులు మీ దగ్గర ఉంటే వాటిని సీజ్ చేయడంతో పాటు దానిపై అదనంగా 37 శాతం వరకు జరిమానాలు పడే అవకాశం ఉంటుంది. అందుకే వీలైనంత తక్కువగా డబ్బును మీ ఇంట్లో ఉంచుకోవడమే మంచిది. ఒక వేళ ఎక్కువ మొత్తంలో డబ్బులు ఇంట్లో దాచుకుంటే దానికి సంబంధించిన అన్ని పత్రాలు దగ్గర పెట్టుకోవడం ద్వారా నష్టపోకుండా ఉండవచ్చు. అలాగే చట్టపరమైన చర్యలు తీసుకోకుండా చూసుకోవచ్చు.

## లెజెండ్

# వీణపై ప్రతి వాణిని పలికించిన వైణికుడు ఈమని



శంకరాభరణం శంకరశాస్త్రి అంటే తెలియని వారు ఉండరేమో గాని, ఈమని శంకరశాస్త్రి గురించి ఈ నాడు చాలా మందికి తెలియక పోవచ్చు. వీణలో మహామహోపాధ్యాయుడ్కైన ఈమని శంకరశాస్త్రి (సెప్టెంబర్ 23, 1922 – డిసెంబర్ 23, 1987) సంగీత కచేరీలు విన్నవారికి ఆయన గొప్పదనం ఎటువంటిదో తెలిసినదే. వాద్య సంగీతంలో శంకరశాస్త్రితో పోల్చదగిన వ్యక్తులు ఆనాడూ, ఈనాడూ కూడా చాలా తక్కువమందే కనిపిస్తారు. గమక విన్యాసంలోనూ, రాగ ప్రస్తారంలోనూ ఆయనది అద్వితీయమ్కైన ప్రతిభ. వీణ మీద ఎన్ని రకాల శబ్దాలు పలికించ వచ్చునో పరిశోధించి, శోధించి నిరూపించిన అనన్య సామాన్య కళాకారుడాయన. కారణాలేమ్కైనప్పటికీ ఇంత గొప్ప కళాకారుడికి రావలసిన ఖ్యాతి మాత్రం రాలేదు.

సీతారామ కల్యాణం (రావణుడు వీణ వాయించే ఘట్టం), వెంకటేశ్వర మహత్యం (సరస్వతి "వాచస్పతి" రాగం వాయించే సీను) మొదల్కైన కొన్ని తెలుగు సినిమాల్లో శాస్త్రి వీణ నేపథ్యం వినబడుతుంది. కచేరీలలో అప్పుడప్పుడూ పాట పాడి వినిపిస్తూ అవే సంగతులను వీణమీద పలికించే అలవా టుండేది. మంత్రపుష్పం వంటివి వాయిస్తున్నప్పుడు "ప్రజా"వంటి పదాలను ఉచ్చరిస్తూ కుడిచేత్తో అందుకు అనుగుణంగా డబుల్ మీటు వేసేవారు. ఇక కుడి చేత్తో ఆయన తీగలను మీటే పద్ధతి కూడా చాలా గొప్పగా ఉండేది. సందర్భాన్నీ, అవసరాన్నీ బట్టి ఆయన తన కుడి చేతి పొజిషన్‌నూ, తీగను మీటే స్థానాన్నీ పలు రకాలుగా మార్చేవారు. ఆయన పలికించిన తానం అనితర సాధ్యం. మూడో తీగనూ, నాలుగో తీగనూ బొటన వేలితో మీటుతూ మంద్ర, అనుమంద్ర స్థాయిల్లో స్వరాలను అత్యద్భుతంగా వాయించే వారు. మామూలుగా ఉండే మూడు తాళం తీగలే కాక మరొక రెండు ఏర్పాటు చేసి, వాటిని రాగంలోని స్వరాలకు శ్రుతిచేసి మొత్తం మీద ఒక ఆర్కెస్ట్రావంటి ప్రభావాన్ని కలిగించేవారు. కేవలం ఒక్క వీణతోనే అరుదైన రాగాలను ఎంతో డ్రమటిక్‌గా, పెద్ద సింఫొనీ స్థాయిలో వాయించేవారు. ఈ టెక్నిక్‌ల మాట ఎలా ఉన్నా సంగీత కారునిగా ఆయనది ఎంతో పరిక్వత చెందిన మేధస్సు. రాగ స్వభావాన్ని గంభీరంగా, హుందాగా, ఎటువంటి వెకిలి తనమూ లేకుండా వినిపించడం ఆయన ప్రత్యేకత. ఏ మాత్రమూ వేగాన్నీ, ఆర్భాటాన్నీ ప్రదర్శించకుండా స్వరకల్పనలో ఎంతో ఉద్వేగాన్నీ, ఆర్తినీ సునాయాసంగా సృష్టించేవారు. తాను పూర్తిగా రాగభావంలో లీనమ్కై, ప్రేక్షకుల ఉనికిని కూడా గమనించ కుండానే వారిని సంగీతపు అలలలో ఓలలాడించే వారు. ఆయన కచేరీకి ఎన్నిసార్లు వెళ్ళినా, అద్వితీయ మ్కైన ఆయన ప్రతిభ అందరినీ ఆశ్చర్య చకితులను చేస్తూ ఉండేది.

రవిశంకర్, హలీమ్ జాఫర్‌ఖాన్ వంటి సితార్ విద్వాంసులతోనూ, గోపాల్‌కృష్ణ వంటి విచిత్రవీణ కళాకారుల తోనూ జుగల్‌బందీ కచేరీలు చెయ్యడం ఆయన చేశారు. సూర్‌దాస్ భజనలకూ, ఇతర గీతాలకూ ఆయన పహాడీ మొదల్కైన హిందూస్తానీ రాగాల్లో స్వర రచన చేశారు. రేడియోలో అనేక గీతాలకు లలిత సంగీతం సమకూర్చారు. అందులో "న జానే క్యా లాచారీ హై" అనే హిందీ పాటను బాలమురళీకృష్ణ గుజరీతోడీ రాగంలో పాడారు. అలాగే దేవులపల్లివారి రచన "ఒదిగిన మనసున పొదిగిన భావము" అనే పాటకు శాస్త్రి మిశ్ర కాఫీ రాగంలో స్వర పరిచారు. చేశారు. ఢిల్లీలో రేడియో చీఫ్ ప్రొడ్యూసర్ గానూ, నేషనల్ ఆర్కెస్ట్రా కంపోజర్ కండక్టర్ గానూ ఆయన ఎన్నో అద్భుతమ్కైన సంగీత రచనలు చేసి వాద్యబృందాన్ని నిర్వహించారు. వాటిలో శిఖరారోహణం, భ్రమర విన్యాసం, సౌమ్య పురుష మొదల్కైనవి పేరు పొందాయి.

ఆయన 1942–50 మధ్యలో మద్రాసులోని జెమినీ స్టూడియోలో సాలూరు రాజేశ్వరరావుకు సంగీత దర్శకత్వంలో సహాయకునిగా ఉన్నారు. ఆ కాలంలోనే చిట్టిబాబు ఆయనకు శిష్యుడయాడు. 1951లో పి.బి.శ్రీనివాస్‌ను సినీ గాయకుడుగా పరిచయం చేసినది ఈమనే.. 1940లో తిరుచ్చి రేడియో కేంద్రంలో మొదటగా వీణ కచేరీ చేశాక ఆయనకు పేరు లభించ సాగింది. ఆకాశవాణి డైరక్టరేట్ లో సంగీత విభాగంలో చీఫ్ ప్రొడ్యూశర్ గా పనిచేసి, వైణికులుగా లబ్ధ ప్రతిష్ఠులైన శంకరశాస్త్రి ఢిల్లీలో సముచిత గౌరవాన్ని పొందారు.

న్యూయార్క్ లో, వీణావిర్టో బిరుదుతో అమెరికా ప్రభుత్వం 1973లో సత్కరించింది. రష్యా, ఆస్ట్రియా దేశాలు ప్రత్యేక అతిథిగా గౌరవించాయి. ఐక్యరాజ్య సమితి, యునెస్కో అవార్డులు వరించాయి. ప్యారిస్, రోమ్‌లో జరిగిన పలు కచేరిల్లో పాల్గొని సత్కారాలు పొందారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించింది. రాష్ట్ర ప్రభుత్వ రాష్ట్రసంగీత విద్యాంసునిగాను, టీటీడీ ఆస్థాన సంగీతకారునిగా పనిచేశారు. గుంటూరులో జరిగిన ఓ కార్యక్రమంలో స్వర్ణ కంకణ ధారులై, తిరిగి చెన్నైకి రైల్లో వెళుతూ, ఈమని 1987 డిసెంబర్ 23న రైలు ప్రయాణంలోనే కన్ను మూశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం

# ఎన్నికల నానీలు



ఆ అభ్యర్థి ఓట్లు
నోటాకు సమానం
నోట్లు
పంచలేదు మరి !

ఐదేళ్ళకు ఒక్కసారే
పరిమళిస్తుంది !
కులపుష్పం
ఓ కాగితం పువ్వు

ఒక్క ఓటు
హంగ్‌ని జయించింది
ఓడిన ఓట్ల
విలువెంత?

ఉచితం
అనుచితం
ఉపాధి కల్పన
సముచితం

పోలింగ్ కేంద్రానికి
'హల్వ్' వచ్చాడు
పౌరుడు
ఓటరుగా ఎదిగిపోయాడు

రహదారి నాణ్యతే
చూపిస్తుంది,
నీ ఓటుకి
దారి ఏదో !

గంజాయి వనంలో
తులసి మొక్క !
నోటా
కలుపు మొక్కనా ?

'పీల్చే' గాలి
ఉచితంగా అందిస్తాం..'
ఓ గడసరి పార్టీ
ఎన్నికల హామీ

మద్యం సీసాపై
పార్టీ గుర్తు !
ఓటరుకి మాత్రమే
కనిపిస్తుంది

– సోమిశెట్టి వేణుగోపాల్
9182584724

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ఈవారం ఆదివారం సంచికలో ధనుర్మాసం గురించి వివరించిన తీరు చాలా బాగుంది. రచయితకు ధన్యవాదాలు. వివిధ సందర్భాలను ప్రత్యక్షంగా కళ్లకు కట్టినట్టు చూపించిన రచయితకు , ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఞతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుం టుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉ పయోగ పడుతుందని నా మనవి.

**–బి మధుశేఖర్, హైదరాబాద్**

**ఘుమఘుమలు అదురుతున్నాయి**

వారం వారం భాగ్యలక్ష్మి వివిధ రకాలైన వెరైటీ వంటలు రాస్తూ, ఆరో పేజీని ఘుమఘుమలాడి స్తు న్నారు. ఆరోగ్యం, ఆనందం సమ్మి ళితంగా ఆమె చేస్తున్న ప్రయోగా లకు ధన్యవాదా లు. ఆమె నుంచి మరిన్ని కొత్త వంటల రుచులను కోరుకుంటు న్నాం. స్వీట్లు, స్నేక్స్ తయారీలోనూ కొత్త కొత్త రుచులను పరిచయం చేయాలను ఆశిస్తున్నాం.

**– వారాంతపు రజనీ, వరంగల్**

**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రా




లలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకు లకు ధన్యావాదా లు. ప్రధానంగా థియేటర్లలోకి రాకుండా ఓటిటీకే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.


**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**
**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుంది. అలాగే రంకు ధారావాహిక మెచ్చు కోలు గా ఉంది. రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచనలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**– జి. సర్వేశ్వరరావు, తెనాలి**


# శ్రమ విలువ




కావడి మోస్తే బరువు విలువ
కష్ట పడితే బతుకు విలువ
ఆదమరిస్తే ప్రాణం విలువ
నిరుద్యోగికి ఉద్యోగం విలువ
ఉద్యోగం ఇస్తే డిగ్రీ విలువ
దూరమైతే మనిషి విలువ
చేజారితే క్షణం విలువ
నోరు జారితే మాట విలువ
ఫెయిలైతే ఒక్క మార్కు విలువ
కాలు జారితే మానం విలువ
కాలి నడకలో దూరం విలువ
చెరువు ఎండితే నీటి విలువ
నేలపై పడుకుంటే పరుపు విలువ
చెమట కక్కితేనే శ్రమ విలువ
కరువుకాటకాల్లో వర్షం విలువ
ఎగుసం చేస్తే రైతు విలువ
సాఫల్యతలో జీవితం విలువ
దగ్గమైతే నిప్పు విలువ
చేయి కాలితే ఉప్పం విలువ
నీటిలో దూకితే ఈత విలువ
నిరక్షరాస్యుడికి అక్షరం విలువ
నిరు పేదకు మెతుకు విలువ
దీర్ఘ రోగికి ఆరోగ్యం విలువ
కవికి కవన వస్తువు విలువ
దెబ్బ తగిలితే నొప్పి విలువ
చేజారి పగిలితే అద్దం విలువ
విస్ఫోటనంలో శాంతి విలువ
కలానికి సిరా చుక్క విలువ
పుస్తకానికి విజ్ఞానం విలువ
అవగతం విలువల విలువలు !

**మధుపాళీ**
**9949700037**


## ఫన్ చ్ నారు






# సూర్య బుడత



# భువన విజయం



భువన మూడో తరగతి చుదువుతుంది.మన్యం ప్రాంతంలోని అరకులోయలోని బుడితి అనే కుగ్రామంలో అమ్మానాన్నలతో కలిసి ఊరికి కొంచెం దూరంలో వాళ్ళు పొలంలో కట్టుకున్న గుడిసెలో నివాసముంటుంది.

అసలే అటవీ ప్రాంతం ఆపై పొలంలోని ఒంటరి ఇల్లు.హానిచేసే జంతువులు,పాములు,పక్షులు వచ్చి వాళ్లకు హాని చేస్తాయని,ఇంటి సంరక్షణ కోసం బీదర్ అనే కుక్కను పెంచుతుంది భువన కుటుంబం.

బీదర్ చాలా తెలివైంది,చురుకైంది,చాలా విశ్వాసం గల కుక్క అది.ఒకరోజు భువన తలిదండ్రులు కట్టెలు కోసం అడవిలోనికి వెళ్లారు.భువన ఇంటి దగ్గర బీదర్ తో ఆడుకుంటుంది.ఇంతలో ఓ నక్క ఒక కుందేలుని తరుముకుంటూ వస్తుంది.కుందేలు భయంతో భువనవాళ్ళ గుడిసెలో దూరిపోయి అటకు ఎక్కి దాక్కుంది.కుందేలు భయం చూసేసరికి భువనకి జాలి కలిగింది,ఎలాగైనా దాన్ని రక్షించాలి అని అనుకుంది.

ఇంటి బయటనుండి కుందేలు కోసం అరుస్తూ అటూఇటూ తిరుగుతున్న నక్కను వదిలేసి కుందేలుని పట్టుకోడానికే ప్రయత్నం చేస్తుంది బీదర్,నక్క నుండి తప్పించుకున్నా ఈ కుక్క వల్ల కుందేలుకి చావు తప్పేటట్లు లేదని గ్రహించి, కుక్క దృష్టిని మళ్లించడానికి భువన నక్క వైపు ఒక చిన్న రాయిని విసిరింది.నక్క గుర్రుగా చూస్తూ గట్టిగా అరుస్తూ తనవైపు రావడంతో కెవ్వున అరిచింది భువన,అంతే కుక్క బీదర్ అమాంతం ఎగిరి నక్కపైకి దూకింది,కుక్కను తప్పించుకొని నక్క అడవివైపు పరుగు పెట్టింది అయినా దాన్ని వదలకుండా బీదర్ వెంబడించింది.

హమ్మాయ్యఅని మనసులో అనుకొని అటకుకి నిచ్చెన వేసి,అటకు మీద ప్రాణభయంతో వణికిపోతున్న కుందేలుని పట్టుకొని జాగ్రత్తగా నిచ్చెన దిగి,నక్క,కుక్క వెళ్లిన వైపుకి కాకుండా వేరువైపుకి తీసుకెళ్లి,బాగా గుబురుగా ఉన్న గడ్డి మైదానంలోకి కుందేలుని వదిలేసింది.కుందేలు చెంగు చెంగున ఎగురుకుంటూ మధ్య మధ్యలో ఆగి వెనక్కి తిరిగి భువనకు థాంక్స్ చెబుతున్నట్లు రెండు చెవులూ హుషారుగా ఊపుతూ గడ్డిలోకి దూరిపోయింది.కుందేలుని రక్షించినందుకు భువన మురిసిపోయింది.

**.......మీగడ వీరభద్రస్వామి 7893434721**

# వేమన శతకం


చిత్త శుద్ధి కలిగి చేసిన పుణ్యంబు
కొంచమైన నదియు గొదవుగాదు
విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత
విశ్వదాభిరామ! వినురవేమ!

భావం: మంచి మనసుతో చేసిన చిన్న పనియైన మంచి ఫలితాన్నిస్తుంది. పెద్ద మర్రిచెట్టుకి కూడ విత్తనము చిన్నదేకదా!

## రంగులేయండి



## దారి చూపండి




## పదాలు ఏరండి

**Words**
Jasmine
Aladdin
Abu
Rajah
Jafar
Diamond
Palace
Tiger
Monkey
Princess

| | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| I | O | S | E | A | A | A | L | J | I | R | H | G | A |
| E | C | A | L | A | P | L | A | E | H | I | A | A | E |
| N | H | A | O | A | N | S | A | D | A | Y | A | A | I |
| A | T | L | A | N | M | A | L | D | T | I | G | E | R |
| D | M | C | R | I | S | D | N | E | D | E | N | S | O |
| D | M | I | N | I | L | O | E | H | S | I | S | I | J |
| D | O | E | C | M | M | A | A | L | J | E | N | C | N |
| N | A | T | D | A | H | J | N | A | C | A | D | O | A |
| R | E | A | I | I | A | D | T | N | A | U | A | S | O |
| J | A | D | A | R | A | S | I | H | A | B | R | I | H |
| E | A | F | C | Y | E | R | E | R | D | A | D | P | J |
| A | E | D | A | O | P | M | O | N | K | E | Y | C | L |
| A | K | I | A | J | C | A | P | A | B | N | G | P | R |
| M | M | J | L | I | E | N | I | D | T | G | C | P | A |



# దేవుడి భార్య

సరికొత్త సీరియల్

(గతవారం తరువాయి)

ఊరి పెద్దమనిషి రాకతో మామూలు జనాలకు అమ్మవారు దర్శనాన్ని నిరాకరించింది. కొద్దిసేపు డబ్బు ఉన్నవారికి, పట్టు చీరలు పెట్టేవారికి, జాతర జరపడానికి నిధులు సమకూర్చిన వారికి, ఊళ్లో పేరు ప్రఖ్యాతాలు ఉన్నవారికి దర్శన భాగ్యం కలిగించింది ఆ మహాతల్లి.

'గుడి లోపల రద్ది, గుడి ముందు రక్తం, గుడి వెనుక రంధి.'

పక్క ఊర్ల నుండి వచ్చినవారికి, అదే ఊళ్లో గుట్ట మీద ఉన్నవారికి మధ్య గొడవ రాజుకుంది. యాడ నుండో వచ్చి పండగపూట మాకు యాపారం లేకుండా చేస్తారా అని పులివెందుల వేశ్యలు గొడవకు దిగారు. జుట్లు జుట్లు పట్టుకున్నారు, చీరలు చింపుకున్నారు, నోటిని కంపు చేసుకున్నారు.

ఊరి పెద్ద వచ్చి సమస్యకు పరిష్కారం చెప్పాడు. ఎవరి యాపారం వారిది, ఎవరి రేటు వారిది, మీరంతా డబ్బు కోసం వచ్చారు, వీళ్ళంతా సుఖం కోసం వచ్చారు. గొడవ పెట్టుకోకుండా గుట్టుగా కానియ్యండి అన్నాడు.

పక్క ఊరి నుండి వచ్చిన గుంపు నుండి ఒకామెను ఇంటికి రమ్మని మీసం మెలేశాడు, కైపుగా చూశాడు, సైగా చేసి ఇంటికి రమ్మని చెప్పాడు. తాను ఏం చెప్తే అది జరగాలి శాసనం, పద్ధతి, కట్టుబాటు, పెద్దరికం.

గుడికి కొందరు భక్తితో, కొందరు రక్తితో, కొందరు అయోమయంలో, కొందరు సమస్యలు తీరతాయని, కొందరు సమస్యలు తీరాయని, కొందరు మొక్కుకోవడం కోసం, కొందరు తిట్టడం కోసం, కొందరు న్యాయం అడగడానికి, కొందరు అమ్మవారి అలంకరణ చూడటానికి, కొందరు ప్రసాదం కోసం, కొందరు కోళ్ళ కోసిన తర్వాత కోడి తలకాయలను ఏరుకోడానికి, కొందరు జాతరలో ఆడోళ్లను గెలకడానికి, బాధలు తీర్చమని కొందరు, తీరిన బాధలకు లంచాలు ఇవ్వడానికి కొందరు ఎవరి కారణాలతో, ఎవరి అవసరాలతో వాళ్లు గుడికి వెళ్లారు. బీవి కూడా గుడికి వెళ్ళింది. బీవితో పాటు ముగ్గురు కూతుళ్లు, ఇద్దరు అల్లుళ్ళు, మస్తాన్ కూడా వెళ్లాడు. బీవి, కూతుళ్లు గుడిలోకి, అల్లుళ్లు గుడి వెనుకకు, మస్తాన్ గుడి పక్కన వెలసిన కల్లు దుకాణానికి వెళ్లారు. ఇంటి నుండి అందరు ఒక చోటుకనే వెళ్లారు కానీ వారి వారి కోరికల మేరకు విడిపోయారు. అమ్మవారు విడగొట్టిందేమో!.

అల్లుళ్లు ఇంటికి వచ్చారని కోడిని కోసింది. వంట ఇంట్లో ఒక అల్లుడికి, మరో గదిలో ఇంకో అల్లుడికి జాగా ఇచ్చి బయట పడుకుంది. మస్తాన్ ఇంటికి వెళ్ళడు. జాతర అయిపోయే వరకు కల్లు దుకాణమే తన ఇల్లు. అక్కడే భక్తి-రక్తి, విందు-పొందు, సరసం-సమరం, సుఖం- అమరత్వం.

రెండు రోజులపాటు జాతర కన్నులవిందుగా జరిగింది. చివరిరోజున అమ్మవారిని ఊరంతా తిప్పుతారు. అమ్మవారి ఊరేగింపుగా ఒక బండిలో ఊరేగుతుంది. ఆ బండి ముందు హిజ్రాల గుంపు డ్యాన్స్ చేస్తున్నారు, వారి ముందు ఇంకో గుంపు కోలాటం ఆడుతున్నారు, వాళ్ల ముందు ఇంకో గుంపు కట్టేలతో విన్యాసాలు చేస్తున్నారు.

ఆ గుంపులకు అవతల, ఇవతల వేశ్యలు గిరాకీ మాట్లాడుకుంటున్నారు, దాని ముందు ఒక మేకపిల్ల కాళ్లు కట్టేసి ఎత్తుగా వేలాడదీసారు. అది గింజుకుంటోంది, భయపడుతోంది. జనమంతా దాన్ని వింతగా చూస్తున్నారు, దాని అరుపులకు కొందరు నవ్వుకుంటున్నారు, కొందరు అయ్యో! పాపం అనుకుంటున్నారు, కొందరు మొక్కుకుంటున్నారు. దాని కళ్లలో మరణం, హింస, మానవ హింస, రాక్షసత్వం, అమ్మవారి నిర్దయ, చేతకానితనం. ఇంతకూ అక్కడ అమ్మవారు ఉన్నదా!?.

తాగుబోతులు సారా కోసం, ఆడవారు మగవారి కోసం, మగవారు ఆడవాళ్ల కోసం, యువకులు యువతుల కోసం రకరకాల కారణాలతో వచ్చిన వారితో ఊరేగింపు సాగుతోంది. కొందరు ఇంటి ముందు నీళు చల్లుకున్నారు, మరికొందరు ప్యాడ నీళ్లు చల్లుకున్నారు, ఇంకొందరు ఇంటి ముందు ప్యాడతో అలికి, ముగ్గులు వేశారు.

బాగా బలిసినవారు చేసిన తప్పులు, అన్యాయాలు మాఫీ చేసుకోడానికి జాతరలో అందరికి పానకం పోస్తున్నారు, తాగడానికి నీళ్లు ఇస్తున్నారు, బొరుగులు, కారాలు కలిపి పంచుతున్నారు. అదంతా సేవ అనుకోవాలి కానీ కాదు. భయంతో, బెరుకుతో.

బీవి కూడా ఇంటి ముందు నీళ్లు చల్లింది. ముగ్గులు వేయడానికి తన



మతం ఒప్పుకోదు. అందుకే వేయలేదు. లేదంటే వేసి ఉండేదేమో! అమ్మవారు ఊరేగింపు ఇంటి ముందుకు రావడానికి మరో పది నిముషాలు పడుతుంది. పక్కింటి స్వామిని అడిగి అమ్మవారికి ఏమేమి పెట్టాలో తెలుసుకుంది. ఒక టెంకాయ, ఆకు వక్కలు, ఊదికడ్డీలు, కర్పూరం, తీపి అన్నం పళ్ళెంలో సిద్ధంగా పెట్టుకుంది. ఏమేమి పెట్టుకోవాలో చెప్పినందుకు స్వామికి రెండు రూపాయల లంచం కూడా ఇచ్చుకుంది.

నా బిడ్డల సంసారం బాగుండాలి, మూడోదానికి మంచి మొగుడు దొరకాలి, తన తాడు తెగకూడదు, భర్త తాగుడు మానేయాలి. ప్రతి సంవత్సరం కోరుకున్నదే కోరుకుంది. మార్పు వస్తుందని ఆశ పడింది, మార్పు రావడం లేదని నిరాశ పడుతుంది, అమ్మవారి దయ తనపై లేదని బాధపడుతుంది, తనను తాను తిట్టుకుంటుంది, అల్లాను, అమ్మవారిని కలిపి తిడుతుంది.

ఇంటి ముందుకు అమ్మవారి ఊరేగింపు వచ్చింది. అమ్మవారిని వేడుకుంది, బతిమిలాడింది. నువ్వే దిక్కని మొర పెట్టుకుంది. టెంకాయను పూజారికి ఇచ్చింది, హారతి అందుకుంది. పూజారి బండి వాడి వైపు చూసి పద అన్నట్టుగా సైగా చేశాడు. బండి కదలడం లేదు. ఎద్దులు ముందుకు అడుగు వెయ్యడం లేదు. మొత్తం నిశబ్దం, ఏం జరుగుతోందో అర్థం కాలేదు.

పూజారి జైమాత అని కేక వేశాడు. అందరూ అనుసరించారు. కేకలు, అరుపులు, పూనకాలు, అలజడి, అయోమయం. బీవికి ఏం అర్థం కావడం లేదు. తన ఇంటి ముందు నుండి అమ్మవారి బండి ఎందుకు కదలడం లేదు, నేనేం పాపం చేశాను, నా మీద అమ్మవారికి కోపం వచ్చిందా? అమ్మా! తల్లీ! క్షమించు అని గొంగెలు పెట్టి ఏడ్చింది.

ఊరేగింపులో ఉన్న జనాలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందరూ పూజారి వైపు చూశారు. పూజారి ఏం చేయాలో తెలియక, తికమకలో పూనకం వచ్చినట్టు ఊగాడు, నటించాడు, జీవించాడు.

జాతరలోని గుంపు నుండి ఒక మహిళ పూనకంతో ఊగింది, యాపాకు నమిలింది, నిమ్మకాయను కొరికింది. ఆడవాళ్లు పూనకం వచ్చిన మహిళకు బొట్టు పెట్టారు, హారతి ఇచ్చారు.

'శాంతించు తల్లి! ఏం కావాలో చెప్పు?' భయంగా, భక్తిగా అడిగారు.

'ఆ మహిళ నోరు విప్పింది'

'కోబలి.. కోబలి.. కోబలి'

'రక్తం.. రక్తం.. రక్తం'

'బలి.. బలి.. బలి'

'యాట.. యాట.. యాట'

***

"ఊరు మండిపోతుంది, మాడిపోతుంది, కాలిపోతుంది. దుష్టశక్తులు పొంచి ఉన్నాయి. ఊరు వల్లకాడు అవుతుంది. ముదనష్టపు రోగాలు ఊరిని ఊడ్చేస్తాయి, మింగేస్తాయి, పీల్చి పిప్పి చేస్తాయి."

"శ్మశానం.. శ్మశానం.. శ్మశానం ఊరంతా పీనుగుల కుప్ప అవుతుంది."

"తల్లీ! నువ్వే కాపాడాలి. నీ బిడ్డలను అన్యాయం చేయద్దు." ఎవరో వేడుకున్నారు.

"నీకు సాధ్యం కానిది ఏముంది తల్లీ! నువ్వు తలుచుకుంటే ఏ దుష్టశక్తులు మమ్మల్ని ఏం చేయలేవని" మరొకరు అరిచారు.

"దాహం.. దాహం.. దాహం"

"పొలిమేరల్లో కాసుకు కూర్చున్నాయి. తలలు తెంపాలని, రక్తం పారించాలని, ఊరిని శవాలదిబ్బ చేయాలని." పూనకం వచ్చిన మహిళ సెలవిచ్చింది, భయపెట్టింది, పిచ్చిదానిలా ఊగింది.

"తల్లీ! కాపాడు.. మాకు నువ్వే దిక్కు" ఈసరయ్య మాట్లాడాడు. తన తరపున కాదు, ఊరందరి తరపున.

ఈసరయ్య మాజీ సర్పంచ్. పేరుకే మాజీ కానీ ఊరంతా తన చెప్పు చేతుల్లోనే ఉంటుంది, ఉండేలా చేసుకున్నాడు. అలా ఉండటానికి, తన అధికారాన్ని, డబ్బును, హోదాను వాడుకున్నాడు. అవి సరిపోలేదని ప్రజలపై మూఢనమ్మకాల ఆయుధాలను వదిలాడు. ఊరి ప్రజల బలహీనతలపై దెబ్బకొట్టాడు. వాస్తవానికి ఊరి ప్రజలను బలహీనం చేసింది అతనే. కావాల్సింది పొందటానికి, అనుకున్నది నెరవేరడానికి ఎందరినో వాడుకున్నాడు. అందులో గ్రామదేవత కూడా ఉంది.

ఈసరయ్య ఏం చెప్తే.. అదే వింటాడు ప్రస్తుత గ్రామ సర్పంచ్. ఇప్పుడున్న సర్పంచ్ కి సర్పంచ్ పదవి రావడానికి కారణం ఈసరయ్యే. భారతదేశ ప్రధానికి, ఈసరయ్యకు పెద్ద తేడా కనిపించదు. దేశ ప్రధాని రాష్ట్రపతిని, మంత్రులను, స్వతంత్ర వ్యవస్థలను ఎలా అయితే చేతిలో పెట్టుకొని ఆడిస్తాడో ఈసరయ్య కూడా ఇప్పుడున్న సర్పంచ్ ని, గ్రామ పంచాయితీ అధికారులను, ఊరి ప్రజలను, గ్రామదేవతను తన చెప్పుచేతుల్లో పెట్టుకొని ఆడిస్తాడు. పదవులు, పరిధులు వేరు కాని చేసేది మాత్రం ఒక్కటే.

మనుషుల రక్తానికి బదులు పశువుల రక్తాన్ని పారించండి. దుష్టశక్తులు చల్లబడతాయి. ఊరు పచ్చగా ఉంటుంది. ఊరు పచ్చగా ఉండటానికి మూగజీవాలను బలివ్వాలని కోరింది. మనుషులకు బదులుగా నోరు లేని పశువులను చంపమని శాసించింది.

ఊరు చుట్టూ పది పొలిమేరలు ఉన్నాయి. ఒక ఇంటికి చెందిన ఎనుములనే బలి ఇవ్వాలి. ఒకే ఇంటి రక్తం పారాలి. త్యాగం చేయాలి, ఊరిని కాపాడాలి, ఊరి ప్రజలను రక్షించాలి.

సరే తల్లీ అలాగే! నువ్వెలా చేయమంటే అలా చేస్తాము. నీ దాసులం, బానిసలం, మూరు లం, వెధవలం. మా తప్పులను క్షమించు తల్లీ మాకు నువ్వే దిక్కు ఈసరయ్య వణుకుతూ, భయపడుతూ, భక్తితో పలికాడు. భక్తి ముసుగులో తన పన్నాగాన్ని అమలు పరిచాడు.

కొబ్బరికాయ కొట్టి పూజారి హారతి ఇచ్చాడు. కొద్దిసేపు అలాగే ఊగి నేలపై పడిపోయింది పూనకం పట్టిన మహిళ. ఎవరో నిమ్మపండును ఇచ్చారు, మరెవరో మజ్జిగ నీళ్లు నోటికి అందించారు.

అమ్మవారి ఊరేగింపు బీవి ఇంటి ముందు ఆగింది కాబట్టి తన ఇంటి పశువులనే బలి ఇవ్వాలి. అదే న్యాయం, అదే తీర్మానం, అదే వాక్కు అదే తీర్పు అన్నాడు పూజారి.

పూజారి అసెంబ్లీలో స్పీకర్ లాంటి వాడు. బిల్లులు పాస్ చేయించేది స్పీకరే అయినా స్పీకర్ ప్రభుత్వానికి తొత్తు, ప్రభుత్వ గొంతు, ప్రభుత్వ మనిషి. ఈసరయ్య పథకానికి పూజారి సహకరించాడు. అలా సహకరించినందుకు తన వాటా తనకు ముడుతుంది.

ప్రభుత్వం చేసే అన్ని పనికిమాలిన పనులకు స్పీకర్ మద్దతు ఇచ్చినట్లు పూజారి కూడా ఈసరయ్య పథకాలకు మద్దతు ఇస్తాడు. స్పీకర్ కి రాజ్యాంగం హక్కులను కల్పిస్తే, పూజారికి ప్రజల మూర త్వం, అమాయకత్వం, మూఢనమ్మకాలు, భక్తి లాంటివి హక్కులను కల్పించాయి.

వాస్తవానికి ఎవరూ కల్పించలేదు. తనకు తానే కల్పించుకున్నాడు. ప్రజలు కష్టాలతో, బాధలతో సతమతం అవుతుంటే వాళ్ల కష్టాలకు, బాధలకు కారణం అమ్మవారే అని నమ్మించాడు. అమ్మవారిని నమ్మండి అన్నీ తానే చూసుకుంటుందన్నాడు. ప్రజలు అమ్మవారిని నమ్మలేదు. పూజారిని నమ్మినారు. పూజారి గొంతే అమ్మవారి గొంతు అనుకున్నారు కానీ ఆ గొంతు వెనుక ఈసరయ్య లాంటివాళ్లు ఉన్నారని గ్రహించడం లేదు.

అలా అంటే ఎలా పూజారి గారు? ఎనుములు లేకపోతే బీవి తన కుటుంబాన్ని ఎలా పోషిస్తుంది? మస్తాన్ గాడేమో పచ్చి తాగుబోతు ఇంట్లో పెళ్ళికాని ఆడపాప ఉందని నంగి మాటలు మాట్లాడాడు ఈసరయ్య.

తురకోళ్ల ఇంటి నుండి యాటలు ఎందుకు ఇస్తాము? మాకు దేవుడు అల్లా మాత్రమే అన్ని కష్టాలను ఆయనే తీరుస్తాడు. బీవి ఇంటి నుండి జీవాలను ఇచ్చేది లేదని ఊరి హజరత్ కోపంగా ఊగాడు.

పశువులు తనవే అయినట్టు, బీవి తన మనిషి అయినట్టు, ఆ ఇంటికి తానే పెద్దగా భావించాడు.

(మిగతా వచ్చేవారం)



రచన : జానీ తక్కెడశిల
7259511956

# కూలీ బిడ్డగా పుట్టి.. సీఈవోగా ఎదిగి..

**సక్సస్ స్టోరీ**





ఎంతో సానపడితే కానీ వజ్రం మెరవదు.. ఎన్నో కన్నీళ్లు, కష్టాలను అధిగమిస్తే కానీ విజయం వరించదు. బిలియన్ డాలర్ల సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఈవో స్థాయికి ఎదిగిన జ్యోతిరెడ్డి కూడా అంతే. జీవితంలో ఎన్నో ఆటుపోట్లు చూసింది. వ్యవసాయ కూలీ కుటుంబంలో పుట్టి, అనాథ శరణాలయంలో పెరిగిన ఆమె.. కీ సాఫ్ట్ వేర్ సొల్యూషన్స్ సీఈవో ఉన్నత స్థానానికి చేరింది.

ఆ క్రమంలో ఎన్నో ప్రతికూలతలను ఎదురొడ్డి నిలిచింది. ఆ ప్రతికూలతలనే అవకాశాలుగా మలుచుకుంటూ.. విజయపథంలోకి రివ్వున దూసుకుపోయింది. జ్యోతిరెడ్డి స్వస్థలం వరంగల్. తండ్రి వ్యవసాయ కూలీ. చాలీచాలని సంపాదన. ఐదుగురి సంతానంలో ఒకరిగా జ్యోతి కూడా ఆకలితో నకనకలాడిన రోజులున్నాయి. మంచి జీవితం అందుతుందన్న ఆశతో పదేళ్ల వయసులో జ్యోతిని, ఆమె సోదరిని ఓ అనాథాశ్రమంలో చేర్పించాడు తండ్రి.

ఐదేళ్లు అక్కడే పెరిగిందామె. టెన్త్ క్లాస్ ముగియకముందే.. 16 ఏళ్ల వయసులో ఓ రైతుతో పెళ్లి జరిగింది. రెండేళ్లు తిరిగే సరికి ఇద్దరు బిడ్డలకు తల్లి అయింది. కుటుంబపోషణ కోసం పనులు చేయక తప్పలేదు. పస్తులతో ఉన్న తనలాంటి జీవితం పిల్లలకు ఉండరాదన్న తలంపుతో వ్యవసాయ కూలీగా మారింది. తానూ ఎంతో కొంత సంపాదిస్తే.. వారి తిండికి కొదవ ఉండదనేది జ్యోతి భావన. అప్పట్లో లభించిన రోజుకూలీ ఐదు రూపాయలే. ఇద్దరు బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం ఇది చాలదు. ఇంకా ఏం చేయాలా? అనే ఆలోచనలు నిత్యం ఆమెను వెంటాడేవి.

అందుకోసం వచ్చిన ఏ చిన్న అవకాశాన్నీ ఆమె చేజార్చుకోలేదు. ఆ పట్టుదలతోనే ఓపెన్ యూనివర్సిటీ నుంచి 1994లో బీఏ డిగ్రీ పూర్తి చేసింది. తోటి రైతులకు చదువు చెప్పింది. ఆపై ప్రభుత్వ టీచర్‌గా ఉద్యోగాన్ని సంపాదించగలిగింది. బిడ్డలను ఉన్నత జీవితాన్ని ఇవ్వాలంటే తాను కష్టపడుతున్నది చాలదనిపించింది జ్యోతికి. కజిన్ సాయంతో అమెరికా వెళ్లాలనే నిర్ణయానికి వచ్చింది. అందుకోసం పార్ట్ టైం ఉద్యోగాలు చేసింది.

1997లో కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎంఏ పూర్తి చేయడంతో పాటు కంప్యూటర్ ప్రోగ్రామింగ్ నేర్చుకుంది. అమెరికా చేరిన తర్వాత బేబీసిట్టర్‌గా జ్యోతి తొలి కొలువు చేసింది. సేల్స్ గర్ల్, గ్యాస్ స్టేషన్ అటెండెంట్, మోటెల్‌లో.. ఇలా రకరకాల ఉద్యోగాలు చేసిందామె. చివరగా సాఫ్ట్‌వేర్ రిక్రూటర్‌గా స్థిరపడింది. సొంత వ్యాపారం చేపట్టేంత సంపాదించగలిగింది జ్యోతి. 2021లో కీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంస్థను ప్రారంభించింది. 100 మంది ఉద్యోగులున్న ఆ కంపెనీ టర్నోవర్ 15 మిలియన్ డాలర్లకు పైనే.

జ్యోతిరెడ్డి ఏటా ఇండియాకు వస్తుంటారు. ఆగస్టు 29న తన పుట్టిన రోజు వేడుకలను వివిధ అనాథ శరణాలయాల్లో అనాథల మధ్యే జరుపుకుంటుండటం ఆనవాయితీ. అంతే కాదు.. 220 మంది మానసిక దివ్యాంగుల బాగోగులను చూస్తుండటం విశేషం. 'పరిస్థితులు ఎల్లకాలం ఒకేలా ఉండవు.. మీ తలరాతను మీరే రాసుకోండి..' ఇదీ మహిళలకు జ్యోతిరెడ్డి ఇచ్చే పిలుపు.

# 24 కోట్ల కంప్యూటర్లు పని చేయవా? ఇప్పుడేం చేయాలి?




కంప్యూటర్ ఏదైనా అందులో వాడే ఆపరేటింగ్ సిస్టం అదేనండి ఓఎస్ మాత్రం దాదాపుగా విండోస్ ఉంటుంది. యాపిల్ కంప్యూటర్లలో మాత్రం దాని సొంత ఓఎస్ ను వాడేస్తుంటారు. ప్రపంచంలోని వ్యక్తిగత కంప్యూటర్లలో అత్యధికులు వాడేది మాత్రం విండోస్. తాజాగా సదరు మైక్రోసాఫ్ట్ తీసుకున్న నిర్ణయం ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న 24 కోట్ల వ్యక్తిగత కంప్యూటర్లు పని చేసే దానిపై కొత్త సందేహాలు వ్యక్తమవుతున్నాయి. విండోవ్ 10 ఓఎస్ ప్రభావవంతంగా పని చేసేందుకు మైక్రోసాఫ్ట్ అందించాల్సిన సాంకేతికతను ఉపసంహరించటమే తాజా సమస్యగా చెప్పాలి. అయితే.. మైక్రోసాఫ్ట్ విండోస్ అప్డేట్స్ ఉపసంహరించినా.. పని చేస్తుందని కాకుంటే సెక్యూరిటీ సమస్యలతో లోపాలు తలెత్తే పరిస్థితి ఉందని చెబుతున్నారు. అప్డేట్స్ ఉండకపోవటంతో సెక్యూరిటీ సమస్యలు ఎదురు కానున్నాయి.

2025 అక్టోబరు తర్వాత విండోస్ ఓఎస్ ఉన్న 24 కోట్ల పీసీలకు మైక్రోసాఫ్ట్ మద్దతును ఉపసంహరించనున్నారు. విండోస్ 11కు మారితే ఎలాంటి ఇబ్బంది ఉండదు. అలా కాకుండా విండోస్ 10లోనే ఉండిపోతానని చెప్పే వారితోనే ఇబ్బంది. అయితే.. విండోస్ 10 నుంచి మారకూడదని అనుకున్న వారికి కూడా.. కొంతమేర డబ్బులు తీసుకోవటం ద్వారా 2028 అక్టోబరు వరకు సెక్యూరిటీ అప్డేట్ లను ఇస్తారని చెబుతున్నారు. అయితే.. ఇందుకు ఎంత ఛార్జ్ చేస్తారన్న దానిపైన మాత్రం క్లారిటీ రాలేదు. ఇదిలా ఉంటే.. సెక్యూరిటీ అప్డేట్స్ కోసం మూడేళ్లు డబ్బులు కడుతూ ఉండే కన్నా.. పాతవి మార్చుకొని కొత్త కంప్యూర్లకు అప్ గ్రేడ్ కావటమే మంచి పనిగా చెబుతున్నారు.

**విండోస్10 భద్రత**

మైక్రోసాఫ్ట్ విండోస్ 10 స్మార్ట్‌కార్డ్‌లు మరియు టోకెన్‌ల వంటి మల్టీఫ్యాక్టర్ ఆథెంటికేషన్ టెక్నాలజీలకు సమీకృత మద్దతు . అదనంగా, విండోస్ హలో విండోస్10కి బయోమెట్రిక్ ప్రామాణీకరణను తీసుకువచ్చింది, వినియోగదారులు వేలిముద్ర స్కాన్, ఐరిస్ స్కాన్ లేదా ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీతో లాగిన్ చేయడానికి అనుమతిస్తుంది. ఆపరేటింగ్ సిస్టమ్‌లో ఐసోలేటెడ్ యూజర్ మోడ్, విండోస్ డిఫెండర్ డివైస్ గార్డ్ మరియు విండోస్ డిఫెండర్ క్రెడెన్షియల్ గార్డ్ వంటి వంర్చువలైజేషన్-ఆధారిత భద్రతా సాధనాలు కూడా ఉన్నాయి. ఈ విండోస్ 10 లక్షణాలు ఏవైనా దాడుల నుండి నష్టాన్ని పరిమితం చేసే ప్రయత్నంలో డేటా, ప్రక్రియలు మరియు వినియోగదారు ఆధారాలను వేరుగా ఉంచుతాయి.

విండోస్10 వినియోగదారుల పరికరాలు, నిల్వ హార్డ్‌వేర్, ఇమెయిల్‌లు మరియు క్లౌడ్ సేవల మధ్య చలనంలో డేటాను రక్షించడానికి బిట్‌లాకర్ ఎన్‌క్రిప్షన్‌కు మద్దతును కూడా విస్తరించింది.

**విండోస్ 10 సిస్టమ్ అవసరాలు**


పిసి లేదా 2-ఇన్-1 పరికరం కోసం కనీస విండోస్10 హార్డ్‌వేర్ అవసరాలు:

ప్రాసెసర్: 1 గిగాహెర్ట్జ్ లేదా వేగవంతమైన ప్రాసెసర్ లేదా సిస్టమ్-ఆన్-ఎ-చిప్ (ఎస్ఓసి)

రామ్ : 32-బిట్ కోసం 1 గిగాబైట్ లేదా 64-బిట్

హార్డ్ డిస్క్ స్పేస్ కోసం 2 జిబి: 32-బిట్ ఓఎస్ కోసం 16 జిబి 64-బిట్ ఓఎస్

గ్రాఫిక్స్ కార్డ్ కోసం 20 జిబి: విండోస్ డిస్ప్లే డ్రైవర్ మోడల్ 1.0 డిస్ప్లేతో డైరెక్టెక్స్ 9 లేదా తదుపరిది



# జీవితం ధన్యం ఉత్తర ద్వార దర్శనం

**శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారా దర్శనంకు ఎందుకు అంత ప్రాధాన్యత? పదిరోజులు పాటు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఎందుకు కల్పిస్తారు? ఏ రోజు దర్శనం చేసుకుంటే మంచి ఫలితాలు సిద్దిస్తాయి? ఇవన్నీ తరచుగా మనకు ఎదురౌతూ ఉండే ప్రశ్నలు. కానీ.. వైకుంఠద్వార దర్శనానికి ఆధ్యాత్మికంగా చాలా విశిష్టత ఉంది. . అవి పాఠకులకోసం..**

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారా దర్శనంకు ఎందుకు అంత ప్రాధాన్యత? పదిరోజులు పాటు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనం ఎందుకు కల్పిస్తారు? ఏ రోజు దర్శనం చేసుకుంటే మంచి ఫలితాలు సిద్దిస్తాయి? ఇవన్నీ తరచుగా మనకు ఎదురౌతూ ఉండే ప్రశ్నలు. కానీ.. వైకుంఠద్వార దర్శనానికి ఆధ్యాత్మికంగా చాలా విశిష్టత ఉంది. . అవి పాఠకులకోసం..

## మానవులుకు 365 రోజులు దేవతలకు ఒక్కరోజుతో సమానం

మానవులుకు 6 నెలల కాల సమయం.. దేవతలకు 12 గంటల సమయంగా పరిగణిస్తారు. దేవతలకు 12 గంటల రాత్రి సమయాన్ని దక్షిణాయణం అని.. పగలు 12 గంటల సమయాన్ని ఉత్తరాయణం అని అంటారు. దక్షిణాయణంలో మహవిష్ణువు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు సేద తీరే సమయం దీనినే కర్కాటక మాసం అంటారు. రాత్రి 8గంటలకు మహవిష్ణువు నిద్రకు ఉపక్రమించే సమయం.. 8 నుంచి 10 గంటల సమయాన్ని సింహ మాసం అంటారు. రాత్రి 10 నుంచి 12 గంటల మధ్య మహవిష్ణువు ప్రక్క తిరిగి పడుకునే సమయం.. ఈ కాలం మానవులకు కన్యా మాసం. అర్ధరాత్రి 12గంటల నుంచి వేకువజాము 2 గంటల వరకు మహవిష్ణువు గాడ నిద్రలో వుండే సమయం.. మానవులుకు తులామాసం! అలాగే మహవిష్ణువు నిద్రలేచే సమయం వేకువజాము 2 గంటల 40 నిముషాలకు.. ఉదయం 2 నుంచి 4 గంటల సమయాన్ని మానవులుకు వృశ్చికమాసంగా పరిగణిస్తారు.మహవిష్ణువు నాలుగు గంటల నుంచి నాలుగు గంటల నలభై నిముషాల వరకు ముక్కోటి దేవతలకు దర్శనభాగ్యం కల్పిస్తారు.. ఉదయం 4 నుంచి 6 గంటల కాలాని ధనుర్మాసంగా పిలుస్తారు.

దేవతలకు ఒక్క గంట సమయం.. మానవులకు 15.2 రోజులుతో సమానం. దేవతలకు 40 నిముషాల సమయం.. మానవులకు 10 రోజులుతో సమానం. ఈ 10 రోజులు కాలమే.. శ్రీవారి ఆలయంలో వైకుంఠ ద్వారాలు తెరిచే పదిరోజులు! దీనితో వైకుంఠ ఏకాదశి నుంచి పది రోజులు వ్యవధిలో.. ఏ రోజు దర్శనం చేసుకున్నా.. ఉత్తమ ఫలితాలే భక్తులుకు సిద్దిస్తాయి అనేది విశ్వాసం.

## 10 రోజులపాటు టిటిడి భక్తులకు వైకుంఠద్వార దర్శనం


వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని టిటిడి ఇప్పిటికే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసింది. శ్రీవారి ఆలయాన్ని తెరిచి ఏకాంతంగా స్వామివారికి పూజాది కైంకర్యాలు నిర్వహించిన అనంతరం వేకువజామున ఒంటిగంటకే శ్రీవారి దర్శనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. 10 రోజులపాటు టిటిడి భక్తులకు వైకుంఠద్వార దర్శనం కల్పించనుంది. వైకుంఠద్వార దర్శనం కోసం సామాన్యులే కాక విఐపిలు పెద్ద సంఖ్యలో తిరుమలకు రానున్నారు. కోట్లాను కోట్ల భక్తుల శరణాగతుడైన శ్రీనివాసుడు వెలసివున్న పుణ్యక్షేత్రం తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీవారిని దర్శించుకోవడానికి నిత్యం వేలాదిసంఖ్యలో భక్తులు తరలివస్తుంటారు. ఏడాదికి 10 రోజులపాటు మాత్రమే ఆలయంలో తెరిచివుంటే వైకుంఠద్వార దర్శనంకోసం సామాన్య భక్తులే కాక విఐపిలు పెద్దసంఖ్యలో భక్తులు తిరుమలకు చేరుకుంటారు.

(మిగతా 8వ పేజీలో)



(7వ పేజీతరువాయి)

వైకుంఠద్వారాలను తెరిచి భక్తులకు వైకుంఠద్వార దర్శనం టిటిడి కల్పించనుంది. వైకుంఠద్వార దర్శనం చేసుకుంటే మోక్షం సిద్ధిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో వైకుంఠద్వార దర్శనం కోసం భక్తులు భారీగానే తరలివస్తారు.





## ద్వాదశినాడు స్వామివారి పుష్కరిణిలో పుణ్యనదులు

కాగా మహావిష్ణువుకు తిథులలో ఏకాదశి, ద్వాదశి అతి ముఖ్యమైనవి. దీంతో ధనుర్మాసం నెలలో వచ్చే ఏకాదశి, ద్వాదశి పర్వదినాలలో దేవతల ద్వారంగా పేర్కొనే ఉత్తర ద్వారాన్ని వైష్ణవ ఆలయాలలో 10 రోజుల పాటు తెరిచి ఉంచుతారు. ఆ రోజున స్వామివారు ప్రత్యేకంగా ఉత్తరద్వారం ద్వారా వెలుపలికి వచ్చి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. శ్రీవారికి ఆలయానికి సంబంధించి ప్రత్యేకంగా ఉత్తరద్వారం లేదు. స్వామివారి ఆనందనిలయంలోనే రెండు ప్రాకారాలు ఉన్నాయి. స్వామివారి గర్భాలయాన్ని ఆనుకుని ఉన్న ప్రాకారం ఒకటైతే మరో ఆరడుగులదూరంలో ఉన్న ఆనందనిలయ గోపుర ప్రాకారం మరొకటి. దీంతో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాన శ్రీవారి భక్తులను ఈ వైకుంఠద్వారంలోనే టిటిడి అనుమతిస్తుంది. దీంతో వైకుంఠద్వార ప్రవేశంతో పాటు స్వామివారి గర్భాలయ ప్రాకారాన్ని స్పృశించే భాగ్యం మరింతమంది భక్తులకు కలగనుంది. వైకుంఠ ఏకాదశి పర్వదినాన శ్రీవారి స్వర్ణథం పై మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ద్వాదశి పర్వదినం రోజు వేకువజామున స్వామివారి పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. ద్వాదశినాడు ముల్లోకాలలో ఉన్న పుణ్యనదులన్నీ స్వామివారి పుష్కరిణిలో కలుస్తాయట.



## 12 టన్నుల పుష్పాలతో

ఆనాడు స్వామివారి పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తే పుణ్యఫలాలు దక్కుతాయని భక్తుల విశ్వాసం. కాగా వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సప్తగిరులను సర్వాంగ సుందరంగా అలంకరిస్తున్నారు. దాదాపు 12 టన్నుల పుష్పాలతో శ్రీవారి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలను పుష్పాలతో పాటు వివిధ రకాల పండ్లతో శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. ఇలవైకుంఠాన్ని తలపించేలా విద్యుత్ దీపకాంతులతో దేదీప్యమానంగా వెలిగిపోయే విధంగా విద్యుత్‌శాఖ సిబ్బంది ఆలయంతో పాటు ప్రధాన రహదారులను తీర్చిదిద్దారు. కాగా గోవిందమాల భక్తులు ఇరుముడులను చెల్లించేందుకు ఆలయం వెలుపల హుండీలను ఏర్పాటు చేశారు. అలాగే వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా వేకువజామున 12.5 గంటలకు స్వామివారి ఆలయాన్ని తెరిచి పూజాది కార్యక్రమాలను పూర్తిచేసి ఒంటిగంటకు శ్రీవారి దర్శనాన్ని ప్రారంభించేవిధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. విఐపిల కోసం ప్రత్యేకంగా పద్మావతి అతిథిగృహం ప్రాంతంలోని సన్నిధానం, వెంకటకళానిలయం, మాతృశ్రీవకుళాదేవి అతిథిగృహం, నారాయణగిరి అతిథిగృహాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి వారికి అక్కడే వసతి, దర్శన టికెట్లను జారీచేసేవిధంగా ఏర్పాట్లు చేశారు.

## ప్రోటోకాల్ పరిధిలో

ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే 6 టికెట్లు, అధికారులకు 4 టికెట్లను జారీ చేయనున్నారు. వైకుంఠద్వార దర్శనం కోసం పలువురు ప్రముఖులు తిరుమలకు వస్తున్నట్లు టిటిడికి ఇప్పటికే సమాచారం అందించారు. న్యాయమూర్తులతో పాటు కేంద్ర, తెలుగు రాష్ట్రాలకు చెందిన మంత్రులు, ఎంపి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కార్పోరేషన్ చైర్మన్ వస్తున్నట్లు టిటిడి సమాచారం అందింది. దీంతో అధికారులు అప్రమత్తమై ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకాదశి పర్వదినాన ముందుగా విఐపి దర్శనాలను ప్రారంభించి పరిమిత సంఖ్యకఆ పాస్‌లను జారీ చేసి, ఉదయం 6 గంటల నుంచి టైంస్లాట్ టోకెన్లు కలిగిన భక్తులను దర్శనానికి అనుమతించేవిధంగా టిటిడి ఏర్పాట్లు చేసింది. ఇక ఏకాదశి, ద్వాదశి పర్వదినాల సందర్భంగా ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను టిటిడి పూర్తిగా రద్దు చేసింది.



## ఇబ్బందులు లేకుండా

శ్రీవారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని వైకుంఠ ద్వారం తెరుచుకుంది. శనివారం వేకువజామునే ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా శ్రీవారి ఆలయం పక్కనే ఉన్న వైకుంఠ ద్వారం తెరిచారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు టీటీడీ పాలకమండలి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి. వైకుంఠ ద్వార దర్శనం ద్వారా భక్తులంతా చాలా సంతృప్తితో స్వామివారిని దర్శించుకుని.. ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఏర్పాట్లు కూడా చేశామన్నారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమలలో ఎనిమిది లక్షల మందికి వైకుంఠ ద్వార దర్శనం కల్పిస్తామన్నారు టీటీడీ ఈవో ధర్మారెడ్డి. సామాన్య భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా స్వామివారి దర్శనం కల్పించడం జరిగిందన్నారు. భక్తులను గంటన్నర ముందుగానే వైకుంఠంలో కూర్చోబెట్టి.. భక్తులకు దర్శనం చేయించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఒకవేళ భక్తులు వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో వేచి ఉండే పరిస్థితి వస్తే.. క్యూలైన్‌లోనే ఆహార పదార్థాలు అందిస్తున్నట్లు తెలిపారు. తిరుపతిలో ఉచిత టోకెన్ల జారీ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించామన్నారు.

## పోటెత్తిన భక్తగణం

వైకుంఠ ఏకాదశి..ద్వాదశి పర్వదినాల్లో వైకుంఠ ద్వార దర్శనం కోసం భక్తులు భారీగా తిరుమల కు తరలి వచ్చారు. వేల సంఖ్యలో భక్తులు తరలి రావటంతో పాటుగా ప్రముఖులు సైతం తిరుమలకు విచ్చేసారు. సోమవారం రాత్రి కే దాదాపు లక్ష మంది క్యూలైన్లలోకి చేరుకున్నట్లు టిటిడి అధికారులు అంచనా వేసారు. వైకుంఠ ద్వారా దర్శనానికి విచ్చేసిన భక్తుల కోసం ప్రత్యేకంగా షెడ్లు ఏర్పాటు చేసారు. చలి ఎక్కువగా ఉండటంతో భక్తులకు దుప్పట్లు సైతం పంపిణీ చేసారు. నారాయణ గిరి ఉద్యానవనంలో నిర్మించిన జర్మన్ షెల్టర్లు, మాడవీధి షెడ్లలో భక్తులకు వసతులను కల్పించారు. అన్నదాన సిబ్బంది, శ్రీవారి సేవకులు భక్తులకు సేవలిందిస్తున్నారు.

# దేవుడి భార్య

## సరికొత్త సీరియల్



(గతవారం తరువాయి)

ఊరి పెద్దమనిషి రాకతో మామూలు జనాలకు అమ్మవారు దర్శనాన్ని నిరాకరించింది. కొద్దిసేపు డబ్బు ఉన్నవారికి, పట్టు చీరలు పెట్టేవారికి, జాతర జరపడానికి నిధులు సమకూర్చిన వారికి, ఊళ్లో పేరు ప్రఖ్యాతులు ఉన్నవారికి దర్శన భాగ్యం కలిగించింది ఆ మహాతల్లి.

'గుడి లోపల రద్ది, గుడి ముందు రక్తం, గుడి వెనుక రంధి.'

పక్క ఊర్ల నుండి వచ్చినవారికి, అదే ఊళ్లో గుట్ట మీద ఉన్నవారికి మధ్య గొడవ రాజుకుంది. యాడ నుండో వచ్చి పండగపూట మాకు యాపారం లేకుండా చేస్తారా అని పులివెందుల వేశ్యలు గొడవకు దిగారు. జుట్లు జుట్లు పట్టుకున్నారు, చీరలు చింపుకున్నారు, నోటిని కంపు చేసుకున్నారు.

ఊరి పెద్ద వచ్చి సమస్యకు పరిష్కారం చెప్పాడు. ఎవరి యాపారం వారిది, ఎవరి రేటు వారిది, మీరంతా డబ్బు కోసం వచ్చారు, వీళ్ళంతా సుఖం కోసం వచ్చారు. గొడవ పెట్టుకోకుండా గుట్టుగా కానియ్యండి అన్నాడు.

పక్క ఊరి నుండి వచ్చిన గుంపు నుండి ఒకామెను ఇంటికి రమ్మని మీసం మెలేశాడు, కైపుగా చూశాడు, సైగా చేసి ఇంటికి రమ్మని చెప్పాడు. తాను ఏం చెప్తే అది జరగాలి శాసనం, పద్ధతి, కట్టుబాటు, పెద్దరికం.

గుడికి కొందరు భక్తితో, కొందరు రక్తితో, కొందరు అయోమయంలో, కొందరు సమస్యలు తీరతాయని, కొందరు సమస్యలు తీరాయని, కొందరు మొక్కుకోవడం కోసం, కొందరు తిట్టడం కోసం, కొందరు న్యాయం అడగడానికి, కొందరు అమ్మవారి అలంకరణ చూడటానికి, కొందరు ప్రసాదం కోసం, కొందరు కోళ్లు కోసిన తర్వాత కోడి తలకాయలను ఏరుకోడానికి, కొందరు జాతరలో ఆడోళ్లను గెలకడానికి, బాధలు తీర్చమని కొందరు, తీరిన బాధలకు లంచాలు ఇవ్వడానికి కొందరు ఎవరి కారణాలతో, ఎవరి అవసరాలతో వాళ్లు గుడికి వెళ్లారు.

బీవి కూడా గుడికి వెళ్ళింది. బీవితో పాటు ముగ్గురు కూతుళ్ళు, ఇద్దరు అల్లుళ్ళు, మస్తాన్ కూడా వెళ్లాడు. బీవి, కూతుళ్లు గుడిలోకి, అల్లుళ్లు గుడి వెనుకకు, మస్తాన్ గుడి పక్కన వెలసిన కల్లు దుకాణానికి వెళ్లారు. ఇంటి నుండి అందరు ఒక చోటుకనే వెళ్లారు కానీ వారి వారి కోరికల మేరకు విడిపోయారు. అమ్మవారు విడగొట్టిందేమో!.

అల్లుళ్లు ఇంటికి వచ్చారని కోడిని కోసింది. వంట ఇంట్లో ఒక అల్లుడికి, మరో గదిలో ఇంకో అల్లుడికి జాగా ఇచ్చి బయట పడుకుంది. మస్తాన్ ఇంటికి వెళ్ళడు. జాతర అయిపోయే వరకు కల్లు దుకాణమే తన ఇల్లు. అక్కడే భక్తి-రక్తి, విందు-పొందు, సరసం-సమరం, సుఖం- అమ-రత్వం.

రెండు రోజులపాటు జాతర కన్నులవిందుగా జరిగింది. చివరిరోజున అమ్మవారిని ఊరంతా తిప్పుతారు. అమ్మవారి ఊరేగింపుగా ఒక బండిలో ఊరేగుతుంది. ఆ బండి ముందు హిజ్రాల గుంపు డ్యాన్స్ చేస్తున్నారు, వారి ముందు ఇంకో గుంపు కోలాటం ఆడుతున్నారు, వాళ్ల ముందు ఇంకో గుంపు కట్టేలతో విన్యాసాలు చేస్తున్నారు.

ఆ గుంపులకు అవతల, ఇవతల వేశ్యలు గిరాకీ మాట్లాడుకుంటున్నారు, దాని ముందు ఒక మేకపిల్ల కాళ్లు కట్టేసి ఎత్తుగా వేలాడదీసారు. అది గింజుకుంటోంది, భయపడుతోంది. జనమంతా దాన్ని వింతగా చూస్తున్నారు, దాని అరుపులకు కొందరు నవ్వుకుంటున్నారు, కొందరు అయ్యో! పాపం అనుకుంటున్నారు, కొందరు మొక్కుకుంటున్నారు. దాని కళ్లలో మరణం, హింస, మానవ హింస, రాక్షసత్వం, అమ్మవారి నిర్దయ, చేతకానితనం. ఇంతకూ అక్కడ అమ్మవారు ఉన్నదా!?.

తాగుబోతులు సారా కోసం, ఆడవారు మగవారి కోసం, మగవారు ఆడవాళ్ల కోసం, యువకులు యువతుల కోసం రకరకాల కారణాలతో వచ్చిన వారితో ఊరేగింపు సాగుతోంది. కొందరు ఇంటి ముందు నీళు చల్లుకున్నారు, మరికొందరు ప్యాడ నీళ్లు చల్లుకున్నారు, ఇంకొందరు ఇంటి ముందు ప్యాడతో అలికి, ముగ్గులు వేశారు.

బాగా బలిసినవారు చేసిన తప్పులు, అన్యాయాలు మాఫీ చేసుకోడానికి జాతరలో అందరికి పానకం పోస్తున్నారు, తాగడానికి నీళ్లు ఇస్తున్నారు, బొరుగులు, కారాలు కలిపి పంచుతున్నారు. అదంతా సేవ అనుకోవాలి కానీ కాదు. భయంతో, బెరుకుతో.

బీవి కూడా ఇంటి ముందు నీళ్లు చల్లింది. ముగ్గులు వేయడానికి తన మతం ఒప్పుకోదు. అందుకే వేయలేదు. లేదంటే వేసి ఉండేదేమో! అమ్మవారు ఊరేగింపు ఇంటి ముందుకు రావడానికి మరో పది నిముషాలు పడుతుంది. పక్కింటి స్వామిని అడిగి అమ్మవారికి ఏమేమి పెట్టాలో తెలుసుకుంది. ఒక టెంకాయ, ఆకు వక్కలు, ఊదికడ్డీలు, కర్పూరం, తీపి అన్నం పళ్ళెంలో సిద్ధంగా పెట్టుకుంది. ఏమేమి పెట్టుకోవాలో చెప్పినందుకు స్వామికి రెండు రూపాయల లంచం కూడా ఇచ్చుకుంది.

నా బిడ్డల సంసారం బాగుండాలి, మూడోదానికి మంచి మొగుడు దొరకాలి, తన తాడు తెగకూడదు, భర్త తాగుడు మానేయాలి. ప్రతి సంవత్సరం కోరుకున్నదే కోరుకుంది. మార్పు వస్తుందని ఆశ పడింది, మార్పు రావడం లేదని నిరాశ పడుతుంది, అమ్మవారి దయ తనపై లేదని బాధపడుతుంది, తనను తాను తిట్టుకుంటుంది, అల్లాను, అమ్మవారిని కలిపి తిడుతుంది.

ఇంటి ముందుకు అమ్మవారి ఊరేగింపు వచ్చింది. అమ్మవారిని వేడుకుంది, బతిమిలాడింది. నువ్వే దిక్కని మొర పెట్టుకుంది. టెంకాయను పూజారికి ఇచ్చింది, హారతి అందుకుంది. పూజారి బండి వాడి వైపు చూసి పద అన్నట్టుగా సైగా చేశాడు. బండి కదలడం లేదు. ఎద్దులు ముందుకు అడుగు వెయ్యడం లేదు. మొత్తం నిశబ్దం, ఏం జరుగుతోందో అర్థం కాలేదు.

పూజారి జైమాత అని కేక వేశాడు. అందరూ అనుసరించారు. కేకలు, అరుపులు, పూనకాలు, అలజడి, అయోమయం. బీవికి ఏం అర్థం కావడం లేదు. తన ఇంటి ముందు నుండి అమ్మవారి బండి ఎందుకు కదలడం లేదు, నేనేం పాపం చేశాను, నా మీద అమ్మవారికి కోపం వచ్చిందా? అమ్మా! తల్లీ! క్షమించు అని గొంగెలు పెట్టి ఏడ్చింది.

ఊరేగింపులో ఉన్న జనాలకు ఏం చేయాలో అర్థం కావడం లేదు. అందరూ పూజారి వైపు చూశారు. పూజారి ఏం చేయాలో తెలియక, తికమకలో పూనకం వచ్చినట్టు ఊగాడు, నటించాడు, జీవించాడు. జాతరలోని గుంపు నుండి ఒక మహిళ పూనకంతో ఊగింది, యాపాకు నమిలింది, నిమ్మకాయను కొరికింది. ఆడవాళ్లు పూనకం వచ్చిన మహిళకు బొట్టు పెట్టారు, హారతి ఇచ్చారు.

'శాంతించు తల్లి! ఏం కావాలో చెప్పు?' భయంగా, భక్తిగా అడిగారు.

'ఆ మహిళ నోరు విప్పింది'

'కోబలి.. కోబలి.. కోబలి'

'రక్తం.. రక్తం.. రక్తం'

'బలి.. బలి.. బలి'

'యాట.. యాట.. యాట'

***

"ఊరు మండిపోతుంది, మాడిపోతుంది, కాలిపోతుంది. దుష్టశక్తులు పొంచి ఉన్నాయి. ఊరు వల్లకాడు అవుతుంది. ముదనష్టపు రోగాలు ఊరిని ఊడ్చేస్తాయి, మింగేస్తాయి, పీల్చి పిప్పి చేస్తాయి."

"శ్మశానం.. శ్మశానం.. శ్మశానం ఊరంతా పీనుగుల కుప్ప అవుతుంది."

"తల్లీ! నువ్వే కాపాడాలి. నీ బిడ్డలను అన్యాయం చేయద్దు." ఎవరో వేడుకున్నారు.

"నీకు సాధ్యం కానిది ఏముంది తల్లీ! నువ్వు తలుచుకుంటే ఏ దుష్టశక్తులు మమ్మల్ని ఏం చేయలేవని" మరొకరు అరిచారు.

"దాహం.. దాహం.. దాహం"

"పొలిమేరల్లో కాసుకు కూర్చున్నాయి. తలలు తెంపాలని, రక్తం పారించాలని, ఊరిని శవాలదిబ్బ చేయాలని." పూనకం వచ్చిన మహిళ సెలవిచ్చింది, భయపెట్టింది, పిచ్చిదానిలా ఊగింది.

"తల్లీ! కాపాడు.. మాకు నువ్వే దిక్కు" ఈసరయ్య మాట్లాడాడు. తన తరపున కాదు, ఊరందరి తరపున.

ఈసరయ్య మాజీ సర్పంచ్. పేరుకే మాజీ కానీ ఊరంతా తన చెప్పు చేతుల్లోనే ఉంటుంది, ఉండేలా చేసుకున్నాడు. అలా ఉండటానికి, తన అధికారాన్ని, డబ్బును, హోదాను వాడుకున్నాడు. అవి సరిపోలేదని ప్రజలపై మూఢనమ్మకాల ఆయుధాలను వదిలాడు. ఊరి ప్రజల బలహీనతలపై దెబ్బకొట్టాడు. వాస్తవానికి ఊరి ప్రజలను బలహీనం చేసింది అతనే. కావాల్సింది పొందటానికి, అనుకున్నది నెరవేరడానికి ఎందరినో వాడుకున్నాడు. అందులో గ్రామదేవత కూడా ఉంది.

ఈసరయ్య ఏం చెప్తే.. అదే వింటాడు ప్రస్తుత గ్రామ సర్పంచ్. ఇప్పుడున్న సర్పంచ్ కి సర్పంచ్ పదవి రావడానికి కారణం ఈసరయ్యే. భారతదేశ ప్రధానికి, ఈసరయ్యకు పెద్ద తేడా కనిపించదు. దేశ ప్రధాని రాష్ట్రపతిని, మంత్రులను, స్వతంత్ర వ్యవస్థలను ఎలా అయితే చేతిలో పెట్టుకొని ఆడిస్తాడో ఈసరయ్య కూడా ఇప్పుడున్న సర్పంచ్ ని, గ్రామ పంచాయితీ అధికారులను, ఊరి ప్రజలను, గ్రామదేవతను తన చెప్పుచేతుల్లో పెట్టుకొని ఆడిస్తాడు. పదవులు, పరిధులు వేరు కాని చేసేది మాత్రం ఒక్కటే.

మనుషుల రక్తానికి బదులు పశువుల రక్తాన్ని పారించండి. దుష్టశక్తులు చల్లబడతాయి. ఊరు పచ్చగా ఉంటుంది. ఊరు పచ్చగా ఉండటానికి మూగజీవాలను బలివ్వాలని కోరింది. మనుషులకు బదులుగా నోరు లేని పశువులను చంపమని శాసించింది.

ఊరు చుట్టూ పది పొలిమేరలు ఉన్నాయి. ఒక ఇంటికి చెందిన ఎనుములనే బలి ఇవ్వాలి. ఒకే ఇంటి రక్తం పారాలి. త్యాగం చేయాలి, ఊరిని కాపాడాలి, ఊరి ప్రజలను రక్షించాలి.

సరే తల్లీ అలాగే! నువ్వెలా చేయమంటే అలా చేస్తాము. నీ దాసులం, బానిసలం, మూరు లం, వెధవలం. మా తప్పులను క్షమించు తల్లీ మాకు నువ్వే దిక్కు. ఈసరయ్య వణుకుతూ, భయపడుతూ, భక్తితో పలికాడు. భక్తి ముసుగులో తన పన్నాగాన్ని అమలు పరిచాడు.

కొబ్బరికాయ కొట్టి పూజారి హారతి ఇచ్చాడు. కొద్దిసేపు అలాగే ఊగి నేలపై పడిపోయింది పూనకం పట్టిన మహిళ. ఎవరో నిమ్మపండును ఇచ్చారు, మరెవరో మజ్జిగ నీళ్లు నోటికి అందించారు.

అమ్మవారి ఊరేగింపు బీవి ఇంటి ముందు ఆగింది కాబట్టి తన ఇంటి పశువులనే బలి ఇవ్వాలి. అదే న్యాయం, అదే తీర్మానం, అదే వాక్కు అదే తీర్పు అన్నాడు పూజారి.

పూజారి అసెంబ్లీలో స్పీకర్ లాంటి వాడు. బిల్లులు పాస్ చేయించేది స్పీకరే అయినా స్పీకర్ ప్రభుత్వానికి తొత్తు, ప్రభుత్వ గొంతు, ప్రభుత్వ మనిషి. ఈసరయ్య పథకానికి పూజారి సహకరించాడు. అలా సహకరించినందుకు తన వాటా తనకు ముదుతుంది.

ప్రభుత్వం చేసే అన్ని పనికిమాలిన పనులకు స్పీకర్ మద్దతు ఇచ్చినట్లు పూజారి కూడా ఈసరయ్య పథకాలకు మద్దతు ఇస్తాడు. స్పీకర్ కి రాజ్యాంగం హక్కులను కల్పిస్తే, పూజారికి ప్రజల మూర త్వం, అమాయకత్వం, మూఢనమ్మకాలు, భక్తి లాంటివి హక్కులను కల్పించాయి.

వాస్తవానికి ఎవరూ కల్పించలేదు. తనకు తానే కల్పించుకున్నాడు. ప్రజలు కష్టాలతో, బాధలతో సతమతం అవుతుంటే వాళ్ల కష్టాలకు, బాధలకు కారణం అమ్మవారే అని నమ్మించాడు. అమ్మవారిని నమ్మండి అన్నీ తానే చూసుకుంటుందన్నాడు. ప్రజలు అమ్మవారిని నమ్మలేదు. పూజారిని నమ్మినారు. పూజారి గొంతే అమ్మవారి గొంతు అనుకున్నారు కానీ ఆ గొంతు వెనుక ఈసరయ్య లాంటివాళ్లు ఉన్నారని గ్రహించడం లేదు.

అలా అంటే ఎలా పూజారి గారు? ఎనుములు లేకపోతే బీవి తన కుటుంబాన్ని ఎలా పోషిస్తుంది? మస్తాన్ గాడేమో పచ్చి తాగుబోతు ఇంట్లో పెళ్ళికాని ఆడపాప ఉందని నంగి మాటలు మాట్లాడాడు ఈసరయ్య.

తురకోళ్ల ఇంటి నుండి యాటలు ఎందుకు ఇస్తాము? మాకు దేవుడు అల్లా మాత్రమే అన్ని కష్టాలను ఆయనే తీరుస్తాడు. బీవి ఇంటి నుండి జీవాలను ఇచ్చేది లేదని ఊరి హజరత్ కోపంగా ఊగాడు.


పశువులు తనవే అయినట్టు, బీవి తన మనిషి అయినట్టు, ఆ ఇంటికి తానే పెద్దగా భావించాడు.

(మిగతా వచ్చేవారం)

రచన : జానీ తక్కెడసిల
7259511956



బాహుబలితో హీరోగా తిరుగులేని ఇమేజ్ సొంతం చేసుకున్న ప్రభాస్.. కేజీ ఎఫ్ సిరీస్ తో గొప్ప పేరు సంపాదించిన దర్శకుడు ప్రశాంత్ నీల్.. ఈ క్రేజీ కాంబినేషన్లో తెరకెక్కిన సినిమా సలార్. భారీ అంచనాల మధ్య ఈరోజు ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం.. ఆ అంచనాలను ఏమేర అందుకుందో చూద్దాం పదండి.




**కథ:**

దేవా (ప్రభాస్) ఒరిస్సాలోని ఒక చిన్న గ్రామంలో అజ్ఞాతవాసం గడుపుతుంటాడు. మెకానిక్ గా పని చేస్తున్న అతన్ని ఒక హింసాత్మక గతం వెంటాడుతూ ఉంటుంది. తల్లి మాట మేరకు అతను హింసకు పూర్తిగా సాధారణ జీవితం గడుపుతుంటాడు. అలాంటి అతను అమెరికా నుంచి వచ్చి శత్రువులకు టార్గెట్గా మారిన ఆద్య (శృతిహాసన్)ను కాపాడాల్సిన బాధ్యత తీసుకుంటాడు. ఆమెను రక్షించే క్రమంలోనే దేవా అత్యంత భయంకరమైన ఖాన్సార్ నేర సామ్రాజ్యానికి ఎదురు వెళ్లాల్సి వస్తుంది. ఇంతకీ ఆ సామ్రాజ్యం నేపథ్యం ఏంటి.. దాంతో దేవాకున్న సంబంధమేంటి... అతడి గతం ఏంటి.. ఆద్యను కాపాడే క్రమంలో అతను ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొన్నాడు అన్నది మిగతా కథ.

**కథనం- విశ్లేషణ:**

మాస్, యాక్షన్ సినిమాల్లో ఎలివేషన్ సీన్లు, యాక్షన్ ఘట్టాలు పండా లంటే హీరో ఇమేజ్ అన్నది చాలా కీలకమైన విషయం. మంచి కటౌట్ ఉండి, మాస్ హీరోగా ఎస్టాబ్లిష్ అయి ఉంటేనే ఎలివేషన్లు క్లిక్ అవుతా యి. కానీ కేజీఎఫ్ సినిమాతో ఈ రూల్స్ అన్నిటిని బ్రేక్ చేసి పడేసాడు ప్రశాంత్ నీల్. అసలు కన్నడలో కూడా పెద్దగా మాస్ ఇమేజ్ లేని యశ్ ను హీరోగా పెట్టి.. అతనితో అస్సలు పరిచయం లేని మన ప్రేక్షకులను రోమాంచితులను చేసి విజిల్స్ కొట్టించడం ఒక సంచలనం. అలాంటి దర్శకుడు బాహుబలితో ఆకాశమంత ఇమేజ్ సొంతం చేసుకున్న ప్రభాస్ తో సినిమా చేస్తున్నాడు అనగానే అందరి దృష్టి ఎలివేషన్ సీన్లు, యాక్షన్ ఘట్టాల మీదకే మళ్లింది. ఆ విషయంలో ప్రశాంతి ఏమి నిరాశపరచ లేదు. బాహుబలి తర్వాత ప్రభాస్ను తన అభిమానులే కాక మాస్ ప్రేక్షకులు చూడాలనుకుంటారో అలా చూపించింది ప్రశాంత్. ప్రభాస్ కటౌట్ ను సరిగ్గా వాడుకుంటే మాస్ కు ఎలా పూనకాలు తెప్పించవచ్చో ప్రశాంత్ చూపించాడు. కానీ మూడు గంటల సినిమాను కేవలం ఎలివేషన్ సీన్లు, పోరాట ఘట్టాలు మాత్రమే నడిపించేయవు కదా. ఇక్కడే సలార్ నిరాశ పరుస్తుంది. గేమ్ ఆఫ్ థ్రోన్స్ స్ఫూర్తితో ఖాన్సార్ పేరుతో ప్రశాంత్ నీల్ సృష్టించిన కొత్త ప్రపంచం కేజీఎఫ్కు ఎక్స్టెన్షన్ లాగా అనిపిస్తుంది తప్ప కొత్తదనం ఏమి కనిపించదు. ఇక నరేషన్ పరంగా కేజీఎఫ్ని మించిన గందరగోళం వల్ల కథను ఫాలో అవడమే పెద్ద పరీక్ష గా మారి శిరోభారం తప్పదు. మొత్తంగా సలార్ ఒక మిశ్రమానుభూతిని కలిగిస్తుంది. కేజీఎఫ్ సినిమా చూస్తున్నపుడు ముందు ఏంటి సినిమా అంతా ఎలివేషన్లే నా.. ఫైట్లేనా.. కథ ఏమీ లేదా అనిపిస్తుంది. కానీ ఒకసారి రివైండ్ చేసుకుంటే అందులో గాఢమైన తల్లి కొడుకుల ఎమోషన్ ఉంటుంది. అలాగే హీరో క్యారెక్టర్ విషయంలో ఒక గ్రాఫ్ కనిపిస్తుంది. దీనికి తోడు విజువల్గా ఎన్నడూ చూడనీ ఒక కొత్త ప్రపంచం చూసిన అనుభూతి ఒక హై ఇస్తుంది. హీరో ఎలివేషన్లు, యాక్షన్ బ్లాక్స్ పరంగా కేజీఎఫ్ ను మించి స్కోర్ చేసిన సలార్.. ఈ మూడు విషయాల్లో వెనుకబడిందనే చెప్పాలి. ఇందులో కూడా తల్లి కొడుకుల బంధాన్ని చూపించడానికి ప్రయత్నించారు. ఎమోషన్ తెప్పించడానికి బదులు చికాకు పెడుతుంది. ఇక మూల కథను ఇద్దరు స్నేహితుల మధ్య బంధం నేపథ్యంలో నడిపిం చాడు ప్రశాంత్. కానీ అందులో కూడా స్ట్రాంగ్ ఎమోషన్ అంటూ ఏమీ లేదు. స్నేహితుడితో హీరో బంధం గొప్పగా అనిపించాలి అంటే ఆ స్నేహితుడి పాత్ర ప్రత్యేకంగా ఉండాలి. పృథ్వీరాజ్ సుకుమారన్ లాంటి ఒక స్పెషల్ ఆర్టిస్టును ఆ పాత్రకు తీసుకున్నారు కానీ క్యారెక్టర్ డిజైన్ మాత్రం సరిగా జరగలేదు. అన్నిటికీ మించి హీరో క్యారెక్టర్ గ్రాఫే చాలా డిజప్పాయింటింగ్ గా అనిపిస్తుంది. ఈ పాత్రను చాలా డల్లుగా మొదలు పెట్టి సహనాన్ని చాలా సేపు పరీక్షిస్తాడు ప్రశాంత్ నీల్. ప్రభాస్ లాంటి మంచి కటౌట్ ఉండబట్టి సరిపోయింది కానీ జీవం లేని ఆ పాత్రలో మరో హీరో ఉంటే అది తేలిపోయేదే.

ఇక కథపరంగా, విజువల్గా సలార్ కొత్తగా ఏమీ అనిపించదు. మాఫి యా చెరబట్టిన ఒక సామ్రాజ్యం.. అందులో ఆధిపత్యం కోసం వివిధ వర్గాల పోరాటం.. అక్కడ హీరో అడుగు పెట్టి తన విశ్వరూపం చూపిం చడం.. ఇలా అంతా కేజీఎఫ్ ఫార్మాట్లోనే సాగిపోతున్నట్లు అనిపిస్తుంది. బ్లాక్ థీమ్తో సాగే విజువల్స్ అన్నీ కూడా ఆల్రెడీ చూసినట్టే అనిపిస్తాయి. అందువల్ల ప్రేక్షకులు ఆశ్చర్యపోయేది అంటూ ఏమీ ఉండదు. సలార్ ట్రైలర్ చూసి థియేటర్లో అడుగు పెట్టిన ప్రేక్షకులను ప్రశాంత్ నీల్ కొంత ఆశ్చర్య పరుస్తాడు. నేరుగా ఖాన్సార్ సామ్రాజ్యంలోకి అడుగు పెడతాం అనుకుంటే.. ట్రైలర్లో చూసిన దానికి భిన్నంగా కథను మరోలా నరేట్ చేశాడు ప్రశాంత్. శృతిహాసన్ పాత్ర చుట్టూ కథను మొదలు పెట్టి.. ఆ తర్వాత హీరో దగ్గరికి వస్తాడు. అయితే ఆరంభ సన్నివేశాలు ఏమంత ఆసక్తికరంగా అనిపించవు. ప్రభాస్ ఇంట్రో పేలిపోతుంది అనుకుంటే చాలా సాధారణంగా ఆ పాత్రను పరిచయం చేశాడు దర్శకుడు. ఆ తర్వాత కూడా హీరో పాత్ర ప్రేక్షకులు కోరుకున్న విధ్వంసం సృష్టించడానికి చాలా సమయమే పడుతుంది. హీరో- తల్లి- హీరోయిన్ పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు మరీ డ్రమటిక్ గా.. ఓవర్ బిల్డప్ ఇస్తున్నట్లు అనిపిస్తాయి. హీరో తన బంధనాలు తెంచుకొని విలయానికి సిద్ధమయ్యాకే ప్రేక్షకుల్లోనూ ఊపు వస్తుంది. అక్కడి నుంచి ఇంటర్వెల్ వరకు ఒక హైతో నడుస్తుంది. ఇంటర్వెల్ ఎపిసోడ్లో ఎలివేషన్ పీక్స్ కు చేరుతుంది. అందుకు తగ్గట్లే ప్రభాస్ ను ఒక పెద్ద టవర్ లాగా చూపించడం.. ప్రేక్షకులకు గూస్ బంప్స్ ఇస్తుంది. దీంతో ఖాన్సార్ సామ్రాజ్యం చుట్టూ నడిచే ద్వితీయార్థం మీద భారీ అంచనాలు పెట్టుకుంటాం. కానీ ఆ అంచనాలకు తగ్గట్లు ద్వితీయార్థం సాగదు. లెక్కకు మిక్కిలి క్యారెక్టర్లు.. వాళ్ల మధ్య కుట్రలు కుతంత్రాలు.. ఈ నేపథ్యంలో గజిబిజిగా సాగే కథాకథనాలు ఆసక్తిని సన్నగిల్లేలా చేస్తాయి. కథను అర్థం చేసుకోవడమే పెద్ద పరీక్షగా మారుతుంది. ఎప్పుడు, ఎక్కడ, ఏం జరుగుతోందో అర్థం కాని అయోమయం నెలకొంటుంది. కేజీఎఫ్ లో కూడా ఈ సమస్య ఉన్నప్పటికీ.. అక్కడ ఇతర అంశాలు సినిమాను డ్రైవ్ చేస్తాయి. కానీ సలార్ లో ఆ మ్యాజిక్ మిస్సయింది. కానీ ద్వితీ- యార్థంలోను ఎలివేషన్లు, యాక్షన్ ఘట్టాలు అయితే బాగానే పేలాయి. ప్రభాస్ తెరపైకి వచ్చిన తీసుకొచ్చాడు. కథపరంగా సినిమా చివర్లో అనేక ప్రశ్నలు విడిచి పెట్టాడు ప్రశాంత్. అవన్నీ సలార్-2 లో చూడాల్సిందే. చివర్లో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఇచ్చిన ట్విస్టు, తనను ఎలివేట్ చేసిన తీరు అభిమానులను మెప్పిస్తాయి. రెండో భాగం ఇంకా మెరుగ్గా ఉండొచ్చు అన్న ఆశలు రేకెత్తిస్తుంది క్లైమాక్స్. కానీ సలార్ ఫస్ట్ పార్ట్ మాత్రం మిశ్రమానుభూతినే మిగులుస్తుంది.

**నటీనటులు:**

ప్రభాస్ పెర్ఫార్మెన్స్ అంటూ ఇందులో చెప్పుకోవడానికి ఏమీ లేదు. ఉన్నదంతా తన స్క్రీన్ ప్రెజెన్స్ మాత్రమే. ప్రభాస్ ముఖ కవళికలు స్పష్టంగా కనిపిస్తూ డైలాగులు చెప్పే సన్నివేశాలు వేళ్ళ మీద వెతుక్కోవాల్సిందే. ప్రశాంత్.. ప్రభాస్ కు అలాంటి అవకాశం పెద్దగా ఇవ్వలేదు. ప్రభాస్ కటౌట్, స్క్రీన్ ప్రెజెన్స్ ను వాడుకొని ఆ క్యారెక్టర్ ని ఎలివేట్ చేయడానికి ప్రయత్నించాడు. బాహుబలి తర్వాత ప్రభాస్ ను మాస్ కోణంలో ది బెస్ట్ గా చూపించింది ప్రశాంత్ అనడంలో సందేహం లేదు. యాక్షన్ సన్నివేశాల్లో ప్రభాస్ వావ్ అనిపిస్తాడు. కానీ ప్రభాస్ నుంచి ఒక పెర్ఫార్మెన్స్ ఆశించిన వాళ్ళు మాత్రం సలార్ చూసి నిరాశ చెందుతారు. ప్రభాస్ లుక్స్ ఓకే. హీరోయిన్ శృతిహాసన్ సినిమాకు పెద్ద మైనస్ అయింది. తన పాత్ర కానీ, లుక్స్ కానీ ఏమాత్రం ఆకట్టుకునేలా లేవు. పృథ్వీరాజ్ సుకుమారన్.. వరద పాత్రలో మెప్పించాడు. అయితే స్పెషల్ అనిపించేలా తన క్యారెక్టర్ లేదు. అతను అందరిలో ఒకడిలాగే కనిపించాడు. జగపతిబాబు ఉన్నంతసేపు తన ప్రత్యేకతను చాటుకున్నాడు గాని ఆయన స్క్రీన్ టైం తక్కువే. ఈశ్వరి రావు తల్లి పాత్రలో బాగానే చేసింది కానీ ఆ క్యారెక్టర్ చికాకు పెడుతుంది. ఝాన్సీ కూడా అంతే. శ్రియా రెడ్డి కీలక పాత్రలో రాణించింది. కొన్నిచోట్ల మాత్రం తన నటన అతిగా అనిపిస్తుంది. విలన్లు అందరిలో జాన్ విజయ్ డిఫరెంట్ గా కనిపిస్తాడు. బాబీ సింహా, గరుడ రామ్ మిగతా నటీనటులు తమ పాత్రల పరిధిలో బాగానే చేశారు.

**సాంకేతిక వర్గం:**

రవి బస్రూర్ కేజీఎఫ్ స్టైల్ మ్యూజిక్ ఇందులోనూ కొనసాగించాడు. మొదట్లో కొత్తగా అనిపించిన తన బ్యాగ్రౌండ్ స్కోర్.. సలార్ కు వచ్చేసరికి ఒక రకమైన మోనాటనీ తెచ్చిపెట్టింది. యాక్షన్ బ్లాక్స్, ఎలివేషన్ సీన్లను ఆర్ఆర్ తో అతను బాగానే పైకి లేపినా ఏదో మిస్ అయిన ఫీలింగ్ కలుగుతుంది. కేజీఎఫ్ లో మాదిరి ఉత్తేజితం కలిగించే బ్యాగ్రౌండ్ సాంగ్స్ ఇందులో పడలేదు. మిగతా చిన్న చిన్న బిట్స్ సాంగ్స్ కూడా ఏమంత ఆకట్టుకునేలా లేవు. మ్యూజిక్ పెద్ద ప్లస్ కాదు అలా అని మైనస్ కూడా కాదు. భువన్ గౌడ ఛాయాగ్రహణం అలవాటైన శైలిలోనే సాగింది. విజువల్స్ బాగున్నాయి. యాక్షన్ ఘట్టాలని అతను అద్భుతంగా చిత్రీకరించాడు. నిర్మాణ విలువలకు ఉత్తమ స్థాయిలోనే సాగాయి. సినిమా చాలా రిచ్ గా అనిపిస్తుంది. ఇక దర్శకుడు ప్రశాంత్ విషయానికి వస్తే అతను ఇప్పటికే ప్రేక్షకు అలవాటు చేసిన కేజీఎఫ్ శైలిలోనే ఇంకొక కొత్త ప్రపంచాన్ని సృష్టించి.. తన మార్కు ఎలివేషన్లతో సలార్ కథను నడిపించే ప్రయత్నం చేశాడు. ఎప్పటిలాగే అతని నరేషన్ గజిబిజిగా సాగింది. ద్వితీయార్థంలో ప్రేక్షకులను మరీ కన్ఫ్యూజ్ చేసేశాడు. అయితే ఎలివేషన్ సీన్లు, యాక్షన్ ఘట్టాలు తీయడంలో తనకు తిరుగు లేదని ప్రశాంత్ మరోసారి చాటాడు. కేజీఎఫ్ తర్వాత ప్రభాస్ తో ప్రశాంత్ సినిమా అంటే అతడి నుంచి ఇంకా బెటర్ అవుట్ పుట్ ఆశిస్తారు ప్రేక్షకులు. దర్శకుడిగా ఆ అంచనాలను ప్రశాంత్ అందుకోలేకపోయాడని చెప్పాలి.

పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

suryaeditpage@gmail.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)


నిర్వహణ :

స్వర్ణకంకణ సన్మానిత, జ్యోతిష్య చూడామణి, జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద

డా॥ఈడ్పుగంటి పద్మజారాణి

91 9849250852,

91 7506976164

padma.suryapaper@gmail.com




# 24.12.2023 నుంచి 30.12.2023 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ప్రారంభములో రావలసిన ఆదాయాన్ని అందుకుంటారు. గృహములో వాతావరణం కొంత చికాకు. ముఖ్యమైన పనులు, ఆరోగ్య విషయంలో అలోచించి నిర్ణయాలు అవసరం. సంతానం విషయంలో మీరు ఆశించిన స్థాయిలో వారి ఫలితాలు కొంత తక్కువగా ఉండటం వల్ల త్వరగా మీరు ఆందోళన,మానసిక అశాంతికి లోనవుతారు. అయినప్పటికి మరల మిమల్ని మీరు నెమ్మదించుకొని వారి విషయములో భవిష్యత్తు ప్రణాళికలు చేస్తారు. సంతానం కొరకే ఎలక్ట్రానిక్ పరికరాలు విద్యా సంబంధ కంప్యూటర్ల మొదలైన వాటి కోసం ధనాన్నివెచ్చిస్తారు జీర్ణసం బంధ చికాకులు. తండ్రి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెడతారు. విద్యాపరంగా విద్యార్థులు కొత్త ప్రాజెక్టులు చేస్తారు. వారి శ్రమకి గుర్తింపు కొంత లభిస్తుంది.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

ప్రారంభంలో సంఘంలో పలుకుబడి పెరుగుతుంది. నాయకత్వ లక్షణాలు పెరుగుతాయి. తోబుట్టువులు లేదా మిత్రులకు సంబంధించిన వారికి ప్రణాళికల్లో సలహాలిస్తూ సహకరిస్తారు. కుటుంబ సభ్యులతో కలిసి ముఖ్య విషయాలు చర్చిస్తారు. చాలా కాలం ఎదురు చూస్తున్న రావలసిన ధనం కొంతవరకు అందుతుంది. మిత్రులు సహకరిస్తారు ధైర్యం పెరుగుతుంది వారం మధ్యలో ధైర్యంగా సంతృప్తికరంగా వృత్తిపరంగా అభివృద్ధి కొరకు వేసుకున్న ప్రణాళికల్లో ఇతర వ్యక్తుల సలహాలు, జోక్యం చికాకు, విసుగు కలిగిస్తుంది. విదేశీ అవకాశాల కొరకు ప్రయత్నాలు గృహ సంబంధిత విషయాలలో ఖర్చులు అధికంగా ఉన్నప్పటికీ ఇష్టమైన వస్తువు కొనుట కొరకు వెనుకాడరు. శుభకార్యాల కొరకు నిర్ణయాలు తీసుకుంటారు.



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ప్రారంభములో శ్రమ ఒత్తిడి అధికంగా ఉంటాయి సమయానికి విశ్రాంతి తగినంత లేకపోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్ పెంచుకోవాలి. శారీరక శ్రద్ధ పెరుగుతుంది. కమ్యూనికేషన్ బాగుంటుంది. దూర ప్రదేశాల నుంచి అందె కొన్ని విషయాలు మీకు ఆలోచన కలిగిస్తాయి. ప్రయాణాలు సామాన్యముగా ఉంటాయి. భావోద్వేగములు నియంత్రణ అవసరము. స్త్రీలతో అభిప్రాయ బేధాలు రాకుండా వ్యవహరించాలి. మనసు కొంత అలజడి ఉన్న ప్రశాంతంగా ఉంచే ప్రయత్నాలు చేసుకుంటారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గుతారు. వారము మధ్యలో చిన్ననాటి మిత్రులను కలుస్తారు. సమావేశంలో మీ గుర్తింపు గౌరవం పెరుగుతుంది. భాగస్వామి సహకారం ఉంటుంది.



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

వారం ప్రారంభము ఆశించిన గౌరవం పెరుగుతుంది. ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందుకుంటారు. చాలాకాలంగా ప్రణాళిక వేసుకున్నవ్యవసాయము, భూమికి సంబంధించి పెట్టుబడి పెట్టడానికి తీవ్రముగా ఆలోచిస్తారు. అధిక శ్రమ ఒత్తిడి ఉన్నప్పటికీ అనుకున్నది సాధించేందుకు ప్రయత్నం చేస్తారు మీ వృత్తిలో కొంత అభివృద్ధి ఉంటుంది. విద్యార్థులకు సైంటిఫిక్ గా కొత్త ఆలోచనలు చేస్తారు. స్త్రీ సంతానానికి విద్యా పరంగా అభివృద్ధికరంగా ఉంటుంది వారు ఎంచుకున్న రంగాల్లో నూతన అవకాశాలు. ప్రైవేట్ బిజినెస్ చేసే వారికి, సివిల్ ఇంజనీర్లకి కొంతవరకు అభివృద్ధి. ఆదాయం సామాన్యము కుటుంబ సభ్యులలో ఒకరికి వృత్తిపరంగా నూతన అవకాశములు పెద్దవారికి ఆధ్యాత్మిక ఆలోచనలు పెరుగుతాయి.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

వారం ప్రారంభం విదేశీ వృత్తికి అవకాశాలు. చర్చలు. కుటుంబంలో వాతావరణం కొంత ఘర్షణాత్మకంగా ఉంటుంది. దూర ప్రదేశాలలో ఉండే తోబుట్టువుల నుంచి సమాచారాలు. ఎదురుచూస్తున్న విషయాలు ఆశించిన ప్రయోజనము సాధించే అవకాశాలు ఉన్నాయి. ఆరోగ్యము సామాన్యంగా ఉంటుంది. మీ ఆత్మవిశ్వాసం పెరుగుతుంది సామాజిక సేవ చేస్తారు. దూర ప్రదేశాలలో విద్య కొరకు విద్యార్థులు చేసే ప్రయత్నాలు ఆశాజనకంగా ప్రారంభమవుతుంది. మనసులో కోరికలు సాధించేందుకు ప్రయత్నాలు. భూమి నూతన గృహము మొదలైన వాటి గురించి ఎదురు చూస్తున్న విషయాలు సంతృప్తిని ఇస్తాయి. ఆదాయము సంతృప్తినిస్తుంది. రావలసిన ఋణములు అందుకుంటారు ఆధ్యాత్మిక దిశగా ఆలోచనలు చేస్తారు.



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

వారం ప్రారంభంలో ఆధ్యాత్మిక ప్రదేశాల సందర్శన మానసిక తృప్తి, ఆనందాన్నిస్తుంది. విదేశీ విద్య కొరకు ప్రయత్నం చేసే విద్యార్థులకు కొంతవరకు అనుకూలంగా ఉంటుంది. దూర ప్రదేశాల నుంచి రావలసిన బకాయిలు అందుకుంటారు. సామాజిక సేవతో గుర్తింపు గౌరవాన్నిపొందుతారు. ఆకస్మిక ప్రయాణాలు ఉన్నప్పటికీ అనుకోని ఖర్చులు, సంతానానికి విద్యాపరంగా ఖర్చులు అధికంగా ఉంటాయి. వృత్తి పరంగా అభివృద్ధి పరంగా ఉంటుంది. అధికారుల మెప్పు పొందడానికి అవకాశాలు ఉన్నాయి. స్థాన చలనానికి కొంత అవకాశాలు. ముఖ్యమైన ఆత్మీయులకు సహకరించడానికి సమయానికి కొంత ధనాన్ని వెచ్చిస్తారు. మనసు ప్రశాంతంగా ఉంటుంది. ముఖ్యమైన చిన్నపాటి ప్రయాణాలు కూడా అవకాశం ఉంది. పెట్టుబడులు పెట్టుట కొరకై ఆలోచనలు చేస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ప్రారంభంలో క్రొత్త వ్యక్తులతో అపార్థాలకు అవకాశాలు లేకుండా ఆత్మీయులను సంప్రదించి మాట్లాడటం మేలు. ఆర్థికంగా సామాన్యమైన అనుకూలం ఉన్నప్పటికీ ప్రణాళిక బద్ధంగా లేని ఆకస్మిక ఖర్చులు చికాకులు, ఆందోళనని కలిగిస్తాయి. ఆరోగ్య విషయంలో, ముఖ్య ప్రయాణాలు, నిర్ణయాలు కొంత వాయిదా మంచిది. ఇతరులతో కలహం రాకుండా జాగ్రత్త వహించాలి. కుటుంబంలో జరగవలసిన ముఖ్యమైన పనుల కోసం తండ్రితో, ముఖ్యమైన పెద్దలతో దీర్ఘ చర్చలు నిర్వర్తిస్తారు. ముఖ్య విషయంలో జాగ్రత్త అవసరం. తండ్రికి సాంఘికంగా గుర్తింపు పలుకుబడి పెరుగుతుంది. మీ సలహాలు కొరకు ఇతరులు మిమ్మల్ని సంప్రదిస్తారు. వృత్తిపరంగా భాగస్వామితో కలిసి నిర్ణయాలు తీసుకుంటారు.



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో సంఘంలో గుర్తింపు పెరుగుతుంది మీ శ్రమకు తగిన రివార్డులు. కృషి శీలత పెంచుకుంటారు ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. కుటుంబంలో వ్యక్తుల మధ్య అనుకూలత వాతావరణం బాగుంటుంది. భాగస్వామికి వృత్తిపరంగా గౌరవము గుర్తింపు. దూర ప్రదేశాల నుండీ ఆహ్వానాన్నిఅందుకుంటారు. ముఖ్యపనుల్లో కొంత ఆటంకాలు విసుగునిస్తాయి. ముఖ్యంగా డ్రైవింగ్ విషయాల్లోనూ, ఆహార, ఆరోగ్య విషయంలోనూ శ్రద్ధతీసుకోవాలి. సంతాన అభివృద్ధి సంబంధించిన ప్రణాళికలు. ఆలోచనలు బాగుంటాయి మంచి నిర్ణయాలు తీసుకుంటారు పెద్దలు సహకరిస్తారు. భూమికి సంబంధించిన అంశాలలో కొన్ని చికాకులు, ముఖ్య పనులలో ఆలస్యంఅయినా ఓర్పుగా ఎదుర్కొని ముందుకు వెడతారు.



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

వారం ప్రారంభంలో నూతన రుణముల కొరకు ప్రయత్నాలు చేస్తారు . ఇమ్యూనిటీ పవర్ పెరుగుతుంది. శత్రువులపై విజయం సాధిస్తారు. ఆత్మీయులతో కలిసి విహార యాత్రలు రిసార్ట్స్ వంటివటికి వెళ్లే ప్రయత్నాలు చేస్తారు. భాగస్వామి వృత్తి సంబంధ, మరియు మీ వృత్తి అభివృద్ధి అంశాలు, చాలా కాలముగా అనుకున్న వాహన, గృహ సంబంధ పరమైన చర్చలు ముందుకు వెడతాయి. జీర్ణ సంబంధ చికాకులు. ఆరోగ్యముపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వృత్తిపరమైన భాగస్వాములతో అభిప్రాయబేధాలు రాకుండా చూసుకోవాలి. పనులు, ప్రయాణాలు కొంత వాయిదా పడతాయి. నూతన వ్యక్తుల కొరకు ఆకస్మిక ఖర్చులు. గృహ అవసరమైన కొనుగోలు మొదలైన వాటి కోసం ఆలోచనలు చేస్తారు.



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

వారము ప్రారంభము సంతానార్థులకు అనుకూలమైన సమయం. ఇష్టమైన ఆత్మీయుల కోసం అధికంగా ఖర్చు చేస్తారు. నిరుద్యోగులకు వృత్తిలో కొత్త అవకాశాలు. వ్యక్తిగత నైపుణ్యాలను పెంచుకుంటూ ముందుకు వెళతారు. భాగస్వామికి వృత్తిపరంగా అభివృద్ధి కరంగా ఉంటుంది. విద్యా పరమైన పోటీలలో నెగ్గడానికి తీవ్రంగా కృషి చేస్తారు. రహస్య శత్రువులపై విజయం సాధిస్తారు. ఆశించిన ఫలితాలు పొందటానికి ఎక్కువ శ్రమ,వత్తిడి. ఆరోగ్యముపై శ్రద్ధ. వృత్తిపరంగా అభివృద్ధి కరంగా ఉంటుంది. మనసు ప్రశాంతంగా, ధైర్యముగా నిర్ణయాలు తీసుకుంటారు. కుటుంబ కార్యాలలో పాల్గొంటారు. అధికారము ఉండే ముఖ్య స్త్రీలు సహకరిస్తారు. దూరప్రదేశాల్లో నూతన ఉపాధి అవకాశము. ఆత్మీయులు సహకరిస్తారు.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

వారం ప్రారంభంలో నూతన అంశాలు తెలుసుకుంటారు. సంతానముతో వారి విద్యా అంశములలో అభిప్రాయ బేధములు రాకుండా వారితో కలిసి నిదానముగా ఆలోచనలు చేయాలి. వృత్తిపరంగా శ్రమ అధిక బాధ్యతలు. ఉపాసన బలము, ఆధ్యాత్మిక దిశగా ఆలోచిస్తారు, మిత్రులతో మంతనాలు సాగిస్తారు. వారం మధ్యలో ముఖ్య లావాదేవీల్ల లో ఆత్మీయులు, సేవకులు సహకరిస్తారు. పలుకుబడిలో ఉన్న వ్యక్తులతో చర్చలు జరిపేటప్పుడు తొందరపాటు పనికిరాదు. కుటుంబ సభ్యుల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ. బంధు మిత్రులను కలుస్తారు. సమావేశాల్లో పాల్గొంటారు.ఆధ్యాత్మిక ఆనందం కలుగుతుంది. ఆరోగ్యము అనుకూలముగా ఉంటుంది. సంతానానికి విదేశీ అవకాశాలు. కొత్త వ్యక్తుల పరిచయాలు ఏర్పడతాయి,



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

వారం ప్రారంభంలో తోబుట్టువులతో సమావేశాలు చర్చలు. చిన్న ప్రయాణాలు చేస్తారు. మీలోని సృజనాత్మకతతో కొత్త రచనలు చేస్తారు. ఆధ్యాత్మిక చింతన పెంచుకుంటారు. నూతన అంశాలపై శ్రద్ధ. పెట్టుబడులు పెట్టేటప్పుడు జాగ్రత్త అవసరం. భూమికి సంబంధించి, తల్లి వైపు బంధువులకు సంబంధించి కలహాలు రాకుండా జాగ్రత్త వహించాలి. వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగర్త. సమయానికి ఆహార స్వీకరణ అవసరము. విద్యార్థులకి విద్య పై ఆసక్తి పెంచుకోవాలి అనుకూలంగా ఉంటుంది. పరిచయం లేని వ్యక్తులతో వ్యవహరించేటప్పుడు లేదా వృత్తిలో విదేశీ ఆదాయాన్ని పొందేందుకు అవకాశముంది. ఆరోగ్య విషయంలో యోగా ప్రాణాయామ మొదలైనవి మంచి ఫలితాలు ఇస్తాయి.



సంయుక్త మీనన్